



నాగేంద్రాయ నమః

ఉదయగిరిలో నాగులపుట్టకు పూజ చేస్తున్న భక్తులు





రాపూరులో నాగులపుట్ట వద్ద చవితి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నెల్లూరులోని ములాపేట ధర్మరాజుల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

● భక్తిశ్రద్ధలతో నాగులచవితి ● పుట్టల వద్ద బారులు తీరిన మహిళలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం నాగులచవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే చన్నీటిస్నానం చేసి పుట్టల వద్దకు వెళ్లి నోము దారాలు చుట్టి వచ్చారు. అనంతరం ఒక్కపొద్దులు ఉండి, మళ్లీ పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు. శైవ, వైష్ణవాలయాలన్నింటిలో నాగులుచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో యువతీ,యువకులు, కొత్త దంపతులు, నవబాలింతలు చంటిబిడ్డలతో వచ్చి నాగులకు అభిషేకాలు చేశారు. పుట్టలోని నాగేంద్రుడికి పాలు, చలివిడి ప్రసాదాలు సమర్పించారు.

ఖజానా డీడీ గంగాద్రి ఆకస్మిక మృతి



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ఖజానా శాఖ జిల్లా ఉప సంచాలకుడు (డీడీ) గంగాద్రి(61) శుక్రవారం మృతి చెందారు. ఆయన అనారోగ్య కారణంగా తిరుపతిలోని సిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మృతికి ఏపీటీఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పీ కిరణ్ కుమార్, కార్యదర్శి నరేంద్ర, కార్యవర్గ సభ్యులు, ట్రెజరీ అధికారులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి 29న శంకుస్థాపన

చిన్నజీయర్ స్వామి రాక

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మూలాపేటలోని పురాతనమైన రుక్మిణీ, సత్య భామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాన్ని ప్రభుత్వం పునర్నిర్మిస్తోంది. రూ.16.75కోట్లతో పునఃనిర్మాణ పనులకు ఈ నెల 29వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా జరగనుంది. శంకుస్థాపన సందర్భంగా ఆలయం వద్ద 28వతేదీ ఉదయం 8 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యా హ వాచనం, వాస్తు హోమం, ప్రవేశ బలి, మంగళహారతి, సాయంత్రం 6గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ, రక్షాబంధన్, అధివాసం, హోమం జరగనున్నాయి. 29న ఉదయం 8గంటలకు మహా కుంభారాధన, నిత్యహోమాల అనంతరం ఉదయం 11.18గంటలకు శంకుస్థాపన జరగనుంది. స్వామిజీ రాక సందర్భంగా దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి తరలిరావాలని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆలయ సహాయ కమిషనర్ జంజనం శ్రీనివాసరావు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా

● తెల్లవారుజాము నుంచి రవాణాశాఖ తనిఖీలు
● కేసుల నమోదు... పలు సర్వీసుల రద్దు
● ప్రయాణికులకు నగదు వాపస్
● ఖాళీగా మినీ బైపాస్ రోడ్డు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో శనివారం తెల్లవారుజాము నుంచి జిల్లావ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు ప్రైవేటు బస్సులపై దాడులు నిర్వహించారు. జిల్లా మీదుగా ప్రయాణిస్తున్న పలు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పదుల సంఖ్యలో బస్సులు నిబంధనలు పాటించడం లేదని తేలింది.

● కేసుల నమోదు

డీటీసీ బీ. చందర్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో తేజ టూర్స్ ట్రావెల్స్, గ్రీన్‌లైన్ ట్రావెల్స్, విక్రమ్ పెంచలనాయుడు, కావేరి ఎంటర్‌ప్రైజెస్, కావేరి టూర్స్, ట్రావెల్స్, ఎస్ ఖాజాచౌదరి ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసి, ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు తరలించారు. అత్యవసర ద్వారం మూసేసిన బస్సులపై 11 కేసులు, డ్రైవర్ వెనుక రెండో డ్రైవర్‌కు బెర్త్ ఏర్పాటు చేసిన 28 బస్సులపై కేసులు, ఫైర్ పరికరాలు లేని రెండు వాహనాలపై, బస్సు ముందు అద్దం పగిలిన రెండు బస్సులపై కేసులు నమోదు చేశారు. పడుగుపాడు సమీపంలో అధికారులు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. అనంతరం నగరంలోని మినీబైపాస్‌లో నిలిపిఉన్న పలు ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేసి వాటిపై కూడా కేసులు నమోదు చేశారు.

● పలు ట్రావెల్స్ బస్సుల రద్దు

జిల్లా మీదుగా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖ తదితర నగరాలకు వెళ్లే పదుల సంఖ్యలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను శనివారం రద్దు చేశారు. అశిత, సీఎస్ఆర్, లక్కీ బస్సులను రద్దు చేయగా, వాటి ప్రయాణికులకు నగదు వాపస్ ఇచ్చారు. రోజూ ప్రైవేటు బస్సులతో రద్దీగా ఉండే నెల్లూరులోని మినీ బైపాస్‌రోడ్డు ఖాళీగా కన్పించింది. ట్రావెల్స్ బస్సుల్లేక ప్రయాణికులు ఆర్టీసీని ఆశ్రయించారు.



కోవూరు-ఇనమడుగు సెంటర్‌లో ప్రైవేటు బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

విధుల్లోకి పీహెచ్‌సీ వైద్యులు

● 22 రోజుల తర్వాత ఆరోగ్య కేంద్రాలు కళకళ
● డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ● డాక్టర్ల సమ్మె విరమణ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీల) వైద్యులు శనివారం విధుల్లోకి చేరారు. 22 రోజుల తర్వాత వైద్యుల రాకతో పీహెచ్‌సీలన్నీ కళకళలాడాయి. ఈనెల 3 నుంచి తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు సమ్మెలోకి వెళ్లారు. దీంతో ప్రభుత్వం పలుదఫాలుగా వారితో చర్యలు జరిపింది. సానుకూలంగా స్పందన రాకపోవడం వైద్యులు తమ సమ్మెను కొనసాగించారు. అయితే శుక్రవారం జరిగిన చర్చలు ఫలప్రదం కావడంతో సమ్మె విరమించి విధుల్లో చేరారు.

సమ్మె విరమించాం..

తమ డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో శనివారం నుంచి పీహెచ్‌లకు వెళుతున్నాం. రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. 22 రోజులపాటు ఎంతో మంది రోగులు పీహెచ్‌సీలకు వచ్చి వైద్యులు లేక వెనుతిరిగిన మాట వాస్తవమే. కానీ తప్పనిసరి పరిస్థితిలో సమ్మె చేశాం.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు

బడిలో సభ

● పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ
● వచ్చేనెల 26న రాజ్యాంగ దినోత్సవానికి ఏర్పాట్లు
● మూడు దశల్లో పోటీల నిర్వహణ
● నియోజకవర్గానికి ఒక్కరి చొప్పున విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్న లక్ష్యంతో పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ నిర్వహణకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా మాట్లాడేందుకు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. నవంబరు 26న అమరావతిలో రాష్ట్రస్థాయి స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహణకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా, జిల్లాలోని పాఠశాలల్లో మూడు దశల్లో పోటీలను నిర్వహిస్తున్నది.

● ప్రతిభ కనబరిస్తే అసెంబ్లీలోకి..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిస్తే ఎమ్మెల్యేలుగా మాక్ అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం కలగనున్నది. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు. మూడు దశల్లోనూ విజేతలుగా నిలిస్తే మాక్ అసెంబ్లీలో పాల్గొనవచ్చు. మండల స్థాయిలో 'పౌరహక్కులు-పౌరుల బాధ్యతలు' అనే అంశంపై వ్యాసరచన, 'మానవ అభివృద్ధి-చట్టాల రూపకల్పన' అనే అంశంపై వక్తృత్వం, స్వాతంత్ర్య ఉద్యమంపై క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందిన ముగ్గురు విజేతలకు నియోజకవర్గ స్థాయిలో రాజ్యాంగ రూపకల్పన వెనుక చరిత్రపై వ్యాసరచన, వికసిత్ ఏపీపై వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన ఆరుగురిని ఎంపిక చేస్తారు. వీరికి భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీలు నిర్వహించి ఒకరిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తారు. నియోజకవర్గానికి ఒకరు చొప్పున మొత్తం 175 మంది విద్యార్థులు రాష్ట్రఅసెంబ్లీలో పాల్గొంటారు.



అన్నీ ఉన్నత పాఠశాలల్లోనూ నిర్వహణ

జిల్లాలో అన్నీ ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో వర్షాల కారణంగా ఆయా పాఠశాలల్లో పరిస్థితులకు అనుకూలంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తాం. అయితే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వారిచ్చిన సమయానికి పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తాం. జిల్లాలోని ఎంఈవోలకు, హెచ్‌ఎంలకు సమాచారం అందించి విద్యార్థులను ఎంపిక చేయాలని ఆదేశాలిచ్చాం. ఎంపిక చేసిన ప్రతీ ముగ్గురిలో ఒక బాలిక కచ్చితంగా ఉండాలి. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారికి నవంబరు 24న రిజిస్ట్రేషన్, 25న అసెంబ్లీ నియమావళిపై శిక్షణ, 26న అమరావతి వేదికపై స్టూడెంట్స్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తారు.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, డీఈవో



జలదంకి : గోపన్నపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఊళ్లవాగు



వరికుంటపాడు శివాలయం సమీపంలో ఎక్స్‌కవేటర్ సాయంతో వాగు దాటుతున్న గొర్రెల కాపరులు

వదలని వాన

● కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు, ఇంకొన్ని చోట్ల భారీ వర్షం
● పొంగుతున్న వాగులు, వంకలు
● నిండుకుండల్లా చెరువులు
● వర్షాలతో ప్రజల అవస్థలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో శనివారం జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 0.9 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కందుకూరులో 10 మి.మీ, అత్యల్పంగా సీతారామపురంలో 3 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా పోర్టు బ్లెయిర్‌కు 440 కి.మీ దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వాతావరణశాఖ తెలిపింది. రానున్న రెండు, మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

● పొంగుతున్న వాగులు, వంకలు

జలదంకి : మండలాన్ని వర్షం వీడడం లేదు. శనివారం ఉదయం 2గంటలపాటు జలదంకి, జమ్ములపాలెం, ఎల్ఆర్ అగ్రహారం గ్రామాల్లో భారీవర్షం కురిసింది. కురుస్తున్న వర్షాలకు తిమ్మసముద్రం, చోడవరం, రామవరప్పాడు, గట్టుపల్లి గ్రామాల్లో సాగుచేసిన మినుము, పెసర తదితర పైర్లు ఉరకెత్తాయి. మండలంలోని చెరువులన్నీ నిండుకుండల్లా మారాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వీర్లగుడిపాడుకు రాకపోకల బంద్

సంగం : మండలంలోని వీర్లగుడిపాడుకు పెన్నా వరదతో శనివారం రాకపోకలు బంద్ అయ్యాయి. బొగ్గేరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం ముందు ఉండే కలుజుపై నీళ్లు ప్రవహిస్తున్నాయి. బొగ్గేరు వరదకు పెన్నా వరద తోడవడంతో నీళ్లు గ్రామాన్ని చుట్టుముట్టాయి. దీంతో గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ గ్రామానికి బయలుదేరి వెళ్లారు.



వరికుంటపాడు : సచివాలయంలోకి చేరిన వాన నీరు

విద్యార్థులు పాఠశాలలలకు వెళ్లేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. వరిసాగు రైతులు విత్తనాలు, యూరియా కోసం దుకాణాలకు పరుగులు తీస్తున్నారు.

● ఉరుములు, మెరుపులతో వర్షం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. వరికుంటపాడు సచివాలయంలోకి మోకాలిలోతు వర్ష పు నీరు చేరడంతో విధులు నిర్వర్తించడం ఉద్యోగులకు కష్టంగా మా రింది. శివాలయం ప్రాంతంలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో సర్పంచు దిలీప్‌కుమార్ గొర్రెల కాపరులను ఒడ్డుకు చేర్చేందుకు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాల సమీపంలోనూ ఇలాంటి పరిస్థితే రాగా గ్రామస్థులు విద్యార్థులను సురక్షితంగా వాగు దాటించారు.

● సోమశిల అవుట్‌ఫ్లో 63,460 క్యూసెక్కులు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. శనివారం ఉదయం 55,981 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, సాయంత్రానికి 59,571 క్యూసెక్కులుగా నమోదైంది.వరద హెచ్చుతగ్గులుగా సాగుతుండగా దిగువకు గేట్ల ద్వారా 63,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 69 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు.

● కండలేరులో నీటి నిల్వ 59.530 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం పూర్తి స్థాయి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.530 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1540 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 4900 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.

● గండిపాళెంలో పది అడుగులు

ఉదయగిరి : గండిపాళెం జలాశయం నీటిమట్టం శనివారానికి పది అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పేర్కొన్నారు. పైతట్టు ప్రాంతాల నుంచి పిల్లాపేరు, దున్నపోతుల వాగు నుంచి వరద ప్రవాహం వస్తుండటంలో నీటిమట్టం పెరిగే అవకాశముందని ఆయన తెలిపారు.

● పెన్నాలోకి లక్ష క్యూసెక్కుల ప్రవాహం

సంగం : సోమశిల వరద జలాలతోపాటు బీరాపేరు, బొగ్గేరు నుంచి శనివారం పెన్నానదికి లక్ష క్యూసెక్కుల నీరు చేరింది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం 11.8 అడుగులకు చేరింది. సెక్షన్ అధికారులు బ్యారేజీకి వస్తున్న నీటి ప్రవాహాన్ని వచ్చినట్లే గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.

● రాళ్లపాడులో 19.4 అడుగులు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం తగ్గిపోయింది.దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం 19.4 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో నీరు నిండుగా ఉండడంతో ఆయకట్టు రైతులు వరినారుమళ్ల సాగుకు సిద్ధమవుతున్నారు.

వరద బాధితులకు ఉపయోగపడుతుందా..?


● కలెక్టర్ పాఠశాల పరిశీలన

కోవూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : వరదలు సంభవిస్తే బాధితుల్ని తరలించేందుకు వీలుగా మండల పరిధిలో ఎంపిక చేసిన పాఠశాల గదులను కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం సాయంత్రం పరిశీలించారు. పెన్నానది పొర్లు కట్టలు ధ్వంసమై వరదలు సంభవిస్తే పోతిరెడ్డిపాళెంలోని మండల పరిషత్ పాఠశాలకు బాధితులను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సహాయక కార్యక్రమాల తీరును కలెక్టర్‌కు తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య వివరించారు.



తగ్గిన నిమ్మ ఎగుమతులు

● వర్షాలకు తోటల్లోకి వెళ్లలేకున్న రైతులు
● మార్కెట్‌కు రాని కాయలు



పొదలకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొదలకూరులోని మార్కెట్‌కు నిమ్మకాయలు రావడంలేదు. దీంతో ఎగుమతులు తగ్గిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. కొన్ని తోటల్లో వర్షపు నీరు ఉండడంతో కాళ్లు బురదలో దిగబడుతున్నాయి. దీంతో రైతులు తోటల్లోకి వెళ్లలేకపోతున్నారు. అందువల్ల యార్డుకు కాయల తరలింపు బాగా తగ్గాయి. ఇదే పరిస్థితి మరో ఐదు రోజులు వరకు ఉండేలా ఉంది. కాగా కాయలు రాకపోవడంతో కూలీలకు సైతం పని లేకుండాపోయింది. దీనికితోడు ధరలు కూడా తగ్గాయి. కురిసిన వర్షం వల్ల తోటలకు ఇబ్బందిలేకున్నా చిత్తడిగా మారడంతో కాయలు కోయడం సమస్యగా మారింది. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు వీస్తే నిమ్మతోటలకు అపారనష్టం వాటిల్లే అవకాశం ఉంది. వర్షం వల్ల నిమ్మతోటలకు రైతులు పురుగు మందులు పిచికారీ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దోమకాటుకు సకాలంలో మందు పిచికారీ చేయాల్సి ఉంది. ఆలస్యమైతే తోటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.11,860

వెండి కిలో ధర రూ. 1,54,000

వెండి ఒక గ్రాము రూ.160.00

వరద ప్రభావిత ప్రాంతాల్లో టీడీపీ బృందం పరిశీలన

నెల్లూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బోడిగాడితోట వరద ప్రభావిత ప్రాంతాన్ని టీడీపీ బృందం శనివారం పరిశీలించింది. మంత్రి నారాయణ ఆదేశానుసారం నాయకులు పర్యటించారు. వర్షాలకు ఇబ్బందిపడుతున్న వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ భోజన ఏర్పాట్లు చేశారు. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అందరు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ సూచించారు. కాగా, మంత్రి నారాయణ టెలీకాన్ఫరెన్స్ ద్వారా పార్టీ శ్రేణులతో తాజా పరిస్థితులపై ఆరా తీశారు.

రంగవల్లుల కళాకారులకు ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలో స్వర్ణాల చెరువు తీరాన ఉన్న స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కుంభాభిషేకం జరుగుతుందని, ఈ సందర్భంగా ఆలయంలో రంగవల్లులు (ముగ్గులు) వేసే కళాకారులకు ఆహ్వానం పలుకుతున్నట్లు నిర్వాహకులు కామేశ్వరరావు, మధుసూదన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవా రం వేడుకలు స్వర్ణ లింగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీవెంకటేశ్వర కల్యాణ మహోత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతాయని పేర్కొన్నారు.

మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

● జాయింట్ సబ్ రిజిస్ట్రార్ విజయరాణి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ నెల్లూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఐ విజయరాణి ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై వస్తు న్న అవినీతి ఆరోపణల మీద నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమీక్షించారని తెలిపారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలన కోసం, దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో 2.0 సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ప్రజలు ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసి స్లాట్ చేసుకుని, ఆ సమయానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అంతా ఆన్‌లైన్ ప్రక్రియ అయినందున అవినీతికి అవకాశం లేదన్నారు.

విద్యార్థులకు వ్యాధులపై అవగాహన

నెల్లూరురూరల్,అక్టోబరు 25,(ఆంధ్రజ్యోతి) : బుజబుజ నెల్లూరులోని శేషు స్కూల్లో విద్యార్థులకు వివిధ రకాల వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి వెంకట్రావు మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం ప్రాణాంతకమైందని, చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనుమానితులు జీజీహెచ్‌లో ఎలీషా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బీ శేషుయాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

నెల్లూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సజ్జాపురం గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన పెంచలయ్య కుటుంబానికి టీడీపీ నాయకులు అండగా నిలిచారు. శనివారం రూర ల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్ర మంలో గుండ్లపాళెం సొసైటీ చైర్మన్ ప్రదీప్, నాయకులు గోపాల్, కృష్ణయ్య పాల్గొన్నారు.





శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయంలో నాగశిలలకు, పుట్టకు పూజలు చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టల వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దారం చుట్టి, పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలోని నాగ శిలలకు వేకువజాము నుంచే పూజలు చేశారు. భక్తులకు సౌకర్యాలను ఆలయ ఈవో యూ జానకమ్మ పర్యవేక్షించారు. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో పొర్లుకట్ట వద్ద పుట్టకు పూజలు చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శెట్టిగుంటరోడ్డు, నవాబుపేట, కిసాన్‌నగర్, నవలాకులతోటలతోపాటు నిప్పో సెంటర్, భక్తవత్సలనగర్, జర్నలిస్టుకాలనీ, శ్రామికనగర్, కొత్తూరు, కావేరీ నగర్ ప్రాంతాల్లో నాగుల చవితికి ప్రత్యేకంగా పూజలు జరిగాయి.

నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి పర్వదినాన్ని శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టలకు పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. గుడిపల్లిపాడు కూడలి, సౌత్ మోపూరు, ములుముడి, పొట్టేపాళెం, గొల్లకందుకూరు తదితర గ్రామాల్లో పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది.

శివపార్వతులకు ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం రాత్రి శివపార్వతులకు ప్రాకారోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకాలు, పూజలు, పూలంగిసేవ జరిగాయి. ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలోని 36 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.44.40 లక్షలకు చెక్కులను ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. నగరంలోని వేదాయపాళెంలో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఈ పంపిణీ జరిగింది. పదిహేను రోజులకు ఒకసారి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్నామని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.4.60 కోట్లు పంపిణీ చేసినట్లు సోమిరెడ్డి వెల్లడించారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

రూరల్‌లో రూ.14.50 లక్షలు..

నెల్లూరు రూరల్, అక్టోబరు 25,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 12 కుటుంబాలకు రూ.14.50 లక్షల మేర సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం అందజేశారు. మెరుగైన వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఓ వరంలాంటిందని టీడీపీ నేత కోటం రెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. అనంతరం 21వ డివిజన్‌లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించి డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చొరవతో కాలువల్లో పూడికతీత పనులు ముందుగానే చేపట్టడం వల్ల వరద ముప్పు తప్పిందని తెలిపారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : సుషుమ్న క్రియ యోగా గోడపత్రికను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. యోగా ద్వారా మానసిక, ఆధ్యాత్మిక ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. నవంబరు 4వ తేదీ సాయంత్రం 5 గంటలకు వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీఆత్మానందమయి అమ్మ ఆధ్వర్యంలో ఈ యోగా ధ్యాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివప్రభాత్‌రెడ్డి, శ్రుతికీర్తి, ప్రశాంతి, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● **సర్దార్ యూనిట్ మార్చ్ గోడపత్రిక..**

సర్దార్-150 గోడ పత్రికను ఎంపీ ఆవిష్కరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని యువజన వ్యవహారాలశాఖ మై భారత్ ద్వారా సర్దార్-150 పేరుతో దేశవ్యాప్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈనెల 31న నెల్లూరులోని వీఆర్‌సీ మైదానం నుంచి పటేల్ విగ్రహం వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. ఇందులో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు యువజన సర్వీసుల శాఖ అధికారి మహేంద్ర, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడిగా వేమిరెడ్డి కోటారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు.

28న చేనేత కార్మికుల ధర్నా

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేనేతలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ జిల్లా చేనేత శాఖ ఏడీ కార్యాలయం వద్ద ఈ నెల 28వ తేదీన ధర్నా చేస్తున్నట్లు చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు వెల్లడించారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయం లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ప్రతీ చేనేత కార్మికుడికి ఏడాది కి రూ.25వేలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికు నికి 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వ నుంచి రావాల్సిన బకాయిలు రూ.176 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. హెల్త్ ఇన్సూ రెన్స్ కార్డులు ఇవ్వాలని, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో సుబ్రహ్మణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

తిక్కన భవన్‌లో ఏసీ నుంచి డ్రైనేజీ

● కలెక్టరేట్‌లో పట్టించుకోని కేర్ టేకర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో అవుట్ డోర్ ఏసీ కంప్రెషర్ నుంచి డ్రైనేజీ నీరు ప్రవహిస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన ఏసీల కంప్రెషర్ దిగువ భాగంలో అధికారులు వినియోగించే మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ మరుగుదొడ్లలోని మురుగు నీరు ఏసీ కంప్రెషర్ నుంచి ప్రవహిస్తోంది. దీనిని ఎవరూ పట్టించుకోక పోవటంతో సీపీవో కార్యాల యం, ఐఅండ్‌పీఆర్ కార్యాలయాల దగ్గర దుర్గంధపూరిత వాతావరణం నెలకొంది. కలెక్టరేట్‌తో పాటు కలెక్టర్ బంగ్లా, జేసీ బంగ్లా, ఏపీఆర్ఎస్‌ఏ ఏర్పాటు చేసిన పెట్రోలు బంకులలో సమస్యలు లేకుండా చూడటానికి కలెక్టరేట్‌లో పనిచేసే సీనియర్ సహాయకుడిని కేర్‌టేకర్‌గా నియమించారు. ఇతను కలెక్టరేట్ నిర్వహణ, తిక్కన భవన్ పర్యవేక్షణను దగ్గరుండి చూడాలి. కానీ అతను సరిగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. తిక్కన భవన్‌లో ప్రతీ సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజల కోసం తగినంత తాగునీటిని కూడా అందుబాటులో ఉంచటం లేదని, కానీ కార్యాలయ నిర్వహణ పేరుతో బిల్లులు చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



వీబీఆర్ స్కూల్‌కి ఎడ్యుఐకాన్ అవార్డు

నెల్లూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్‌లోని ధనలక్ష్మీపురం వద్దనున్న వీబీఆర్ రెసిడెన్షియల్ స్కూల్‌కి ఎడ్యూ ఐకాన్ - 2025 అవార్డు దక్కినట్లు ఆ స్కూల్ డైరెక్టర్ కాటం శ్రీనివాసులురెడ్డి శని వారం మీడియాకు తెలిపారు. ఈ అవార్డును విశాఖపట్నంలో అక్కడి ఎంపీ శ్రీ భరత్, నిషా అధ్యక్షుడు కులభూషణ్ శర్మ, అపస్మా చాఫ్ మెంబర్ కృష్ణారెడ్డి నుంచి అందుకున్నట్లు చెప్పారు. స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. 29 ఏళ్లగా విద్యా రంగంలో అందించిన సేవలు, నాణ్యమైన విద్య, ప్రమాణాలతో కూడిన బోధన తదితర అంశాలను విశ్లేషించి ఈ అవార్డును అందించారని తెలిపారు.



'ఎమ్మెల్యే సోమిరెడ్డిపై బురద చల్లడం సరికాదు'

వెంకటాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, ఆయన కుమారుడు రాజగోపాల్‌రెడ్డిలపై మాజీ మంత్రి కాకాణి బురద చల్లడం సరికాదని టీడీపీ మండల నాయకుడు డబ్బుగుంట సురేంద్ర హితవు పలికారు. కాకుటూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామస్తుల అనుమతితోనే శివాలయ భూమిలో సిమెంటు రోడ్డు వేశారని, దీనిపై మాజీ మంత్రి కాకాణి ఆలయ భూమిని ఆక్రమించి రోడ్డు వేశారని చెప్పడం అవాస్తవమన్నారు. డబ్బుగుంట గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న చెన్ను తిరుపాల్ రెడ్డి

రాపూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దెలమడుగు వద్ద గల మహావిష్ణువు, అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం పెద్దఎత్తున కొనసాగుతోంది. కార్తీక మాసంలో 10వ రోజు అయ్యప్ప స్వామి మాలధారులకు దివంగత చెన్ను బాలకృష్ణా రెడ్డి పేరిట చెన్ను కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ చెన్ను తిరుపాలు రెడ్డి, నల్లవడ్ల వెంకట రమణా రెడ్డి, మధు రెడ్డి, చెన్ను పెంచల్ రెడ్డి, మందాటి చంద్ర మోహన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్తీక పూజలకు ఏర్పాట్లు

విడవలూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో వెలసివున్న శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిల సహకారంతో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్‌కృష్ణ తెలిపారు. టీడీపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి పొన్నాడి చంద్రశేఖర్, నాయకులు అత్తిరాల రాంమోహన్, పూడి సుకుమార్, వెలసిరి ఉదయ్ కుమార్, రామతీర్థం యువత పాల్గొన్నారు.

రేపు ఆటో కార్మికుల ర్యాలీ

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): ఏటీఎస్ సెంటర్లకు వ్యతిరేకంగా సీఐటీయు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు పట్టణంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సీఐటీయూ అధ్యక్షుడు నాగయ్య తెలిపారు.

నాగయ్యా.. పాలు తాగ రావయ్యా!

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి సందర్భంగా శనివారం వాడ వాడలా మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. బుచ్చి, పుట్టవీధి, పెద్దూరు, దళితవాడ, ఇస్కపాళెం, కట్టుబడి పాళెం తదితర ప్రాంతాల్లో పుట్టల్లో పాలు పోసి పూజలు చేసి ప్రసాదం పంచి పెట్టారు. జొన్నవాడ గ్రామంలో నాగుల చవితిపర్వదినాన్ని నిర్వహించుకునేందుకు సుబ్బరాయుడు పుట్టకు వెళ్ళే దారి లేక భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. బైపాస్‌రోడ్డు చుట్టుకుని వెళ్లారు. కొన్నిరోజుల క్రితం ఆ స్థలం తమదంటూ పలువురు అడ్డుకున్నారు. ఇటీవల కలెక్టర్ స్పందించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో నాగులచవితి రోజు మహిళలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందుకూరుపేట : జగదేవిపేట నల్లలదిబ్బలో నాగుల పుట్ట వద్ద నాగుల చవితి వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

విడవలూరు: విడవలూరు, ముదివర్తి, రామతీర్థం, పార్లపల్లి, ఊటుకూరు, దంపూరు





బుచ్చి: జొన్నవాడలో పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు, ఇందుకూరుపేటలో నాగుల పుట్ట వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వాడవాడలా నాగులచవితి

అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నాగుల పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్కెలు తీ ర్చాలని పుట్టలో పాలు, గుడ్లు వేసి నాగరాజును ప్రార్థించారు.

రాపూరు: పట్టణంలో నాగులచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద చెరువు కింద ఉన్న నాగుల పుట్ట, రాపూరమ్మ ఆలయ ఆవరణలో పుట్టకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్ట చుట్టూ పసుపు దారాలతో అల్లికలు వేసి, కొత్త బట్టలు సమర్పించారు. నువ్వుల ముద్ద, చలిమిడి పిండి ప్రసాదం అందజేశారు. నాగులకు పెట్టిన ప్రసాదాన్ని పిల్లలకు పంచారు. పెద్ద చెరువు కలజు వద్ద పూజలు నిర్వహించారు.

ఐక్యరాజ్యసమితి కృషి గొప్పది

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాంతి స్థాపన, పర్యావరణ పరిరక్షణ, అందరికీ విద్య అందించడంలో ఐక్యరాజ్య సమితి విశేష కృషి చేసిందని ప్రధానోపాధ్యాయురాలు వేదవతి పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి ఏర్పడి 80 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శనివారం రామచంద్రాపురంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు పచ్చని ఆకులతో 80 అంకెలను చిత్రీకరించి, కార్యశాల నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, మున్వర్ అహ్మద్, బ్రహ్మారెడ్డి, రసూల్, గంగాధర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

ముత్తుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో తీర గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణపట్నం పోర్టు ఎస్ఐ జేపీ శ్రీనివాస రెడ్డి సూచించారు. కృష్ణపట్నంలో శనివారం పర్యటించి ప్రజలకు తగిన జాగ్రత్తలు, సూచనలు అందజేశారు. మత్స్య కారులు వేటకు వెళ్లవద్దని, పడవలు, వలలు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు.

పిల్లలకు ఎమ్మెల్యే ప్రశాంతి చేయూత

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు గ్రామానికి చెందిన నక్కా వెంకయ్య పెద్ద కుమారుడు శ్రీనివాసులు, భార్య పద్మావతి మృతి చెందడంతో వారి పిల్లలు సింధు, ప్రియ అనాథలయ్యారు. స్థానిక సర్పంచ్, నాయకుల సమాచారంతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సీఎం చంద్రబాబుకు విషయం తెలిపారు. ఈమేరకు మంజూరైన రూ.3 లక్షలు సీఎం రిలీఫ్ నిధులను ఆ కుటుంబానికి అందజేశారు. పిల్లల చదువులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పిల్లలను సంరక్షిస్తున్న నానమ్మ, తాతయ్యలు ఎమ్మెల్యే ప్రశాంతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పొర్లు కట్టల నిర్మాణ పనులు వేగవంతం చేయండి

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పెన్నానది పొర్లుకట్ట పనులు వేగవంతం చేయాలని, తీర ప్రాంత లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని నిడిముసలి గ్రామం వద్ద పెన్నానది పొర్లుకట్టను శనివారం ఆమె పరిశీలించారు. వర్షంలోనే గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే కాలినడకన పెన్నా పొర్లుకట్ట వద్దకు చేరుకున్నారు. 2021లో పొర్లుకట్టకు గండి పడి నిడిముసలి, కుడితిపాలెం, గంగపట్నం, రాముడుపాలెం, ముదివర్తిపాలెం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుని ప్రజలు అష్టకష్టాలు పడ్డ సంఘటనను స్థానికులు ఆమెకు వివరించారు. సోమశిల నుంచి పెన్నానదికి వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని పొర్లుకట్టలు నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు తాత్కాలిక విరామం పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక నాయకులు, సహాయక చర్యల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, కోడూరు కమలాకర్ రెడ్డి, జెట్టి రాజగోపాల్‌రెడ్డి, పొన్నబోయిన చెంచు కిషోర్ యాదవ్, టీడీపీ మండలాధ్యక్షుడు ఏకొల్లు పవన్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈఈ విజయభాస్కర్ రెడ్డి, తహసీల్దార్ గోపికృష్ణ, ఎంపీడీవో నాగేంద్రబాబు పాల్గొన్నారు.



పెన్నా పొర్లుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

చంద్రబాబు గొప్ప మానవతావాది

కోవూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్ప మానవతావాది అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. తన స్వగృహంలో శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 86 మందికి, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మరో నలుగురికి చెక్కులు అందజేశారు. ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి కోవూరు నియోజకవర్గ పరిధిలో 473 మంది అనారోగ్య బాధితులకు, నెల్లూరు పార్లమెంటు పరిధిలో 44 మందికి సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సాయం మంజూరైందని, ఇందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కృషి చేశారన్నారు. గుండెజబ్బులు, కిడ్నీ, క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి ఆశాజ్యోతిగా నిలిచిందన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

రాపూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో లక్ష్మీనృసింహుడికి శనివారం తెల్లవారుజామున అభిషేకాలు, చందనాలంకార సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం కల్యాణం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, రాత్రి ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. వర్షంలోను అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని ఆలయ ఉప కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండు పరిశీలన

పొదలకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు బురదమయంగా మారిన పొదలకూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బస్టాండ్ చుట్టూ గుంతలు ఏర్పడి నీళ్ల చేరడంతో ప్రయాణికులు, బస్టాండు దుకాణాల సముదాయం వారు బస్టాండ్‌లోకి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలిపారు. గుంతలు పూడ్చేందుకు, గ్రావెల్ తోలేలా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ప్రశాంత్, ఉపాధ్యక్షులు రాచపూటి ధనుంజయరావు, చొప్పా వెంకటేశ్వర్లు, చింతగింజల సుబ్రహ్మణ్యం, గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

● సీనియర్ సివిల్ జడ్జి చైతన్య



మాట్లాడుతున్న న్యాయాధికారిణి చైతన్య

కోవూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలు నిషేధమనీ, గ్రామాల్లో బాలలకు వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా సీనియర్ సివిల్ జడ్జి చైతన్య అన్నారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల సమాచారాన్ని ఐసీడీఎస్ సిబ్బందికి, న్యాయసేవాసమితికి, పోలీసులకు అందించాల్సిందిగా కోరారు. బాల్య వివాహాల వల్ల బాలికలు అమూల్యమైన జీవితాల్ని కోల్పోతు న్నారన్నారు. మేజిస్ట్రేట్ శివ నమ్రత మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టవిరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయ వాదులు మాట్లాడారు.

రక్తదానమే మిన్న: సీఐ రవినాయక్



రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

ముత్తుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని కృష్ణపట్నం సీఐ రవి నాయక్ తెలిపారు. ముత్తుకూరు షాదీ మంజిల్‌లో నేవా బ్లడ్ బ్యాంకు, హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కృష్ణ పట్నం పరిధిలో పోలీసులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మెగా శిబిరం ద్వారా 500 యూనిట్ల రక్తాన్ని సేకరించ డం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కృష్ణపట్నం సర్కిల్ పరిధిలోని పోలీసులతో పాటు యువకులు, విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. పోలీసులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు జేపీ శ్రీని వాసులురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వీరేంద్ర, హెల్పింగ్ హ్యాండ్స్, నేవా బ్లడ్ బ్యాంక్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రేబాల కాలువ పూడికతీత

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): స్థానిక 3వ వార్డులో రేబాల కాలువ పూడిపోవడంతో వర్షాలకు నీళ్ళు పొంగి రోడ్లు మీదకు చేరుతోంది. దీంతో ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. వార్డు కౌన్సిలర్ అందె ప్రత్యూష సమ స్యను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ద్వారా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన ఎమ్మెల్యే శనివారం ఎక్సకవేటర్‌తో కాలువ పూడికతీత చేపట్టారు. కమిషనర్ బాలకృష్ణ, ఏఈ పూజిత పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న ఆటో : ఇద్దరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): కానుగ చెట్లు కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగి రోడ్డు ప్రమాదంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎఎస్‌పేట మండలానికి చెందిన వెంగళరావు, షేక్ హసీనా, సందాని గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.






దుర్గం కొండల అందం.. మది పరవశం!

- కనువిందు చేస్తున్న మేఘాలు, సెలయేళ్లు, జలపాతం
- పోటెత్తుతున్న పర్యాటకులు

ఉదయగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో ఉదయగిరి దుర్గం కొండలు పచ్చటి అందాలను పరుచుకున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు దుర్గంపై గల సల్వాపేట్ జలపాతం కనువిందు చేస్తోంది. అడవుల్లో సెలయేళ్లు గలగలా పారుతూ ప్రకృతి రమణీయతకు అద్దం పడుతున్నాయి. దుర్గం కొండలను మేఘాలు కమ్మేసి చూపరులకు కనువిందు చేస్తున్నాయి. పచ్చటి అందాలను తిలకించేందుకు పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా సెలయేళ్లల్లో స్నానాలు చేస్తూ దుర్గం అందాలను తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరిస్తున్నారు.



కలువాయిలో కొండచిలువ హల్‌చల్

కలువాయి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలువాయిలో శనివారం రాత్రి 12 అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. పిడుగు నరసింహులు రైస్ మిల్లు సెంటర్‌లో రోడ్డుపై ఉండగా స్థానికులు గుర్తించారు. పాములు పట్టే వారు దాన్ని చంపేశారు. ఈ కొండచిలువ సోమశిల కాలువ నుంచి వస్తున్న నీటితో పొల్లాలోకి వచ్చి అక్కడ నుంచి రోడ్డుపైకి వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.



కొండచిలువను చూపిస్తున్న స్థానికులు

పోలింగ్ బూత్‌లలో వసతులు కల్పించాలి

నెల్లూరు(హరనాథపురం); అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఓటర్లు సజావుగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనుకూలంగా పోలింగ్ బూతులలో అన్నీ వసతులు కల్పించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. శనివారం ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6లను త్వరితగతిన పూర్తి చేయాలని, నూతన ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయకుమార్, టీడీపీ నుంచి రసూల్, వైసీపీ నుంచి వెంకట శేషయ్య, బీజేపీ నుంచి శ్రీనివాసులు, బీఎస్పీ నుంచి శ్రీరామ్ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి..

రాపూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి కొనియాడారు. శనివారం రాపూరు ఆర్టీసీ బస్టాండులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెయిన్ కోటు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ రాపూరు డిపోలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందిని శాలువాతో సత్కరించి, పని తీరును అభినందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కారణంగా వంద శాతం ఓఆర్ వచ్చిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం 1500 నూతన బస్సులు, 1350 ఎలక్ట్రికల్ బస్సులు తీసుకురానుందని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ కార్మికుల పదోన్నతులకు ప్రభుత్వం అంగీకరించిందని, నెల్లూరు జోన్ పరిధిలో 1600 మందికి ప్రమోషన్లు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపూరు ఆర్టీసీ డీఎం అనిల్ కుమార్, మండల బీజేపీ నాయకుడు గాలి అంకబాబు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కొండ్లపూడి రాఘవ రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

ఇల్లే విక్రయ కేంద్రం!

- మెప్మా ఉత్పత్తులు అమ్ముకునేలా శిక్షణ
- 12 రకాల ఉచిత ఆన్‌లైన్ కోర్సులు
- పొదుపు మహిళలకు ఎంతో ఉపయుక్తం



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పొదుపు సంఘాల మహిళలు తమ ఇళ్లకే పరిమితమై... చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా బలపడేవారు. అయితే కాలం మారింది... వారు పలు రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే వారు పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం, సాంకేతికతతో కూడిన అనేక అంశాలపై శిక్షణ ఇప్పించేందుకు దృష్టి సారించింది. జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పొదుపు మహిళలకు సాంకేతికతతో కూడిన నైపుణ్యాన్ని అందించడానికి చర్యలు తీసుకుంటోంది.

12 రకాల ఉచిత కోర్సులు

మెప్మా పరిధిలోని పొదుపు మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి, వారు తయారు చేసిన ఉత్పత్తులను ఈ-కామర్స్ వేదికగా విక్రయించుకోడానికి 12 రకాల ఉచిత ఆన్‌లైన్ కోర్సులను మెప్మా రూపొందించింది. ఈ కోర్సుల్లో వస్తు ఉత్పత్తిలో శిక్షణ, ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ మార్కెటింగ్, ఈ బిజినెస్‌ల గురించి పరిచయం చేస్తుంది. ఈ కోర్సులను పొదుపు సంఘాల సభ్యులు ఇంట్లోనే ఉండి, సెల్‌ఫోన్‌లో విని నేర్చుకోవచ్చు. ప్రజ్ఞ వర్చువల్ అకాడమీ ద్వారా శిక్షణ ఇవ్వనుంది. అవని బ్రాండ్ పేరుతో లోకల్ టూ గ్లోబల్ (ఇంటి నుంచి ప్రపంచానికి) అనే నినాదంతో పొదుపు మహిళలు స్వయంగా తమ ఉత్పత్తులను ఈ కామర్స్‌లో పెట్టి విక్రయించుకొనేలా చర్యలు తీసుకుంటారు. అందుకు అవసరమైన అనుమతులను ప్రభుత్వమే చూసుకుంటుంది.

● మనమిత్ర యాప్ తో..

జిల్లాలోని మెప్మా పరిధిలో 15వేల పొదుపు గ్రూపులు ఉన్నాయి. వాటిలో 1.5 లక్షల మంది సభ్యులు ఉన్నారు. మహిళలు తమ సెల్‌ఫోన్‌లో మనమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఈ కోర్సుల్లోని పాఠశాలు వినవచ్చు. జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన మహిళలు ఎందరో ఉన్నారు. వారికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడనుంది.

పొదుపు మహిళలకు ఎంతో ఉపయోగం



అమెజాన్, ఫ్లిప్‌కార్టు, మైస్టోర్ వంటి సంస్థలు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టి ఎలా అమ్ముకుంటున్నారో...? మెప్మా మహిళలు కూడా తమ ఉత్పత్తులను అమ్ముకోడానికి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. మహిళలు తమ ఉత్పత్తులను అమ్ముకోడానికి తగిన తోడ్పాటును మెప్మా ద్వారా అందిస్తాం.

- లీలారాణి, ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మా

ఐఈఆర్‌పీలు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలి

నెల్లూరు(విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండల భవిత కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న 88 మంది ఐఈఆర్‌పీలు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకోవాలని డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు సూచించారు. సమగ్ర శిక్ష పరిధిలోని భవిత కేంద్రాల్లో విజువల్లీ ఇంపైర్డ్, హియరింగ్ ఇంపైర్డ్ విభాగంలో పని చేసే వారు ఈనెల 27వతేదీన, ఎంఆర్ విభాగంలో పనిచేసే వారు 28వతేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. ప్రతీ ఒక్కరూ తప్పక హాజరై త్రిసభ్య కమిటీతో వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆదేశించారు.

డిగ్రీ పరీక్షలకు 976 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో శనివారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు 976 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 14,808 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా, 13,832 మంది హాజరయ్యారన్నారు. నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు తెలిపారు.

కర్నూలు బస్సు ప్రమాద బాధితులకు స్వర్ణభారత్ ట్రస్ట్ అండ



రమేష్ తండ్రి మాలకొండయ్యకు నగదు అందచేస్తున్న బీజేపీ నాయకులు

వింజమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంలో మృతిచెందిన గోళ్ల రమేష్ కుటుంబానికి స్వర్ణభారత్ ట్రస్ట్ అండగా నిలిచింది. శుక్రవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఫోన్‌లో బాధితుడి తండ్రితో మాట్లాడి ధైర్యం చెప్పారు. ట్రస్ట్ తరపున రూ.లక్ష నగదును ట్రస్ట్ సభ్యులు గోళ్లవారిపల్లి గ్రామానికి వెళ్లి అందజేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ సభ్యుడు గడ్డం ప్రసాద్ కుటుంబ పెద్దని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ నరసారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి, టీడీపీ నాయకుడు తుమ్మల కిరణ్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు ఇద్దరి అదృశ్యం

నెల్లూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైనట్లు రూరల్ సీఐ వేణు శనివారం తెలిపారు. రూరల్లోని ధనలక్ష్మీపురం వద్దనున్న ఓ కార్పొరేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న చిల్లకూరు మండలం చింతవరం గ్రామానికి చెందిన లోకేష్, అనంతసాగరం మండలం దేవరాయపల్లి గ్రామానికి చెందిన రాకేష్ ఈ నెల 23వ తేదీ సాయంత్రం నుంచి హస్టల్లో కనిపించడం లేదని స్కూల్ ప్రిన్సిపాల్ తమకు ఫిర్యాదు చేశారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

చెన్నైకు సూపర్ లగ్జరీ బస్సు నడపాలి

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నుంచి చెన్నైకి సూపర్‌లగ్జరీ బస్సు నడపాలని శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ గడియాల్లీ ఎస్థాని డీఎం రమేష్‌కు మార్‌కు విన్నవించారు. స్పందించిన డీఎం ఉన్నతాధికారులతో చర్చించి చెన్నైకి బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడికి తీవ్ర గాయాలు

సంగం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పడమటిపాళెంలో శనివారం సాయంత్రం జరిగింది. వివరాల మేరకు... ఏయస్‌పేట మండలం కొండమీదకొండూరు గ్రామానికి చెందిన సుమన్ ఎయిర్‌టెల్ టవర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మండలంలోని పడమటిపాళెం ఎయిర్‌టెల్ టవర్‌కు అనుబంధంగా ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. మరమ్మతులు చేసేందుకు సిద్దీపురం సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి ఎల్‌సీ కోరాడు. సదరు ఉద్యోగి ఎల్‌సీ ఇచ్చాం... మరమ్మతులు చేసుకోమని చెప్పారు. దీంతో సుమన్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా సబ్‌స్టేషన్ సిబ్బంది సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరా ఇచ్చారు. దీంతో మరమ్మతులు చేస్తున్న సుమన్ విద్యుదాఘాతానికి గురై కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తించిన స్థానిక సురేష్ అనే యువకుడు అతడిని కారులో బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బాధితుడి కుటుంబ సభ్యులు వచ్చి మెరుగైన వైద్య కోసం నెల్లూరుకు తరలించారు.

మద్యం బెల్టు దుకాణాలపై దాడులు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై శనివారం నెల్లూరు స్క్వాడ్ అధికారులు దాడులు నిర్వహించినట్లు ఉదయగిరి ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు కమ్మవారిపాళెం, నర్రవాడ సెంటర్లలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి 29 మద్యం సీసాలతోపాటు ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

మాలేపాటి ఇంట హఠాన్మరణాలు బాధాకరం

● సుబ్బానాయుడు కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ

దగదర్తి(బిట్రగుంట), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అందరితో కలివిడిగా ఉండే రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, టీడీపీ యువ నేత భానుచందర్ నాయుడు హఠాన్మరణాలు బాధాకరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తన సతీమణి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలసి దగదర్తిలోని మాలేపాటి నివాసానికి వచ్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బానాయుడు, భానుచందర్‌నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి భావోద్వేగానికి లోనై కంట తడిపెట్టారు. తన సోదరుడు మాలేపాటి సుబ్బానాయుడు హఠాత్తుగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న సమయంలో తన కుమారుడు భానుచందర్‌నాయుడు మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని మాలేపాటి రవీంద్రనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. భానుచందర్‌నాయుడు సతీమణి మాలేపాటి మాధవిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఓదార్చారు. ఆమె రెండు నెలల చిన్నారి మోరారీదేవను ఒడిలోకి తీసుకున్న లాలించారు. సుబ్బానాయుడు, భానుచందర్‌నాయుడు లేనిలోటు పార్టీకి తీరనిదని మాలేపాటి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లపుడు అండగా ఉంటుందన్నారు. వారి వెంట ఎన్ఎంసీ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, సోమశిల ప్రాజెక్ట్ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, తదితరులు ఉన్నారు.



మాలేపాటి రవీంద్రనాయుడుతో మాట్లాడుతున్న వేమిరెడ్డి దంపతులు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలి

● కోర్టు కానిస్టేబుళ్ల విధులపై సమీక్షలో ఎస్పీ అజిత



కోర్టు కానిస్టేబుళ్లకు మార్గనిర్దేశం చేస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో న్యాయ వ్యవస్థకు సహాయపడే పోలీసు విభాగం, కోర్టు కానిస్టేబుళ్ల పని సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఎస్పీ అజిత సూచించారు. నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టు కానిస్టేబుళ్లు, డీఎస్పీలు, పోలీసు అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. కోర్టు కానిస్టేబుల్ విధులు, ముఖ్యమైన కేసుల్లో అభియోగ పత్రాల దాఖలు, సీసీ నెంబర్లు, సమన్లు, వారెంట్ల అమలు, న్యాయస్థానాలకు హాజరవడం, మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి అవసరమైన అంశాల పై మార్గనిర్దేశం చేశారు. క్రిమినల్ జస్టిస్‌లో పోలీసు వ్యవస్థ భాగమని, కన్విక్షన్ రేటు పెంచాలని, తద్వారా ప్రజల్లో నమ్మకం కలుగుతుందని చెప్పారు. పోలీసు వ్యవస్థలో కోర్టు కానిస్టేబుళ్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నా రు. మానవతా దృక్పథం, సున్నితత్వంతో కూడిన క్లిష్టతరమైన విధులను సమయపాలన, నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు పాల్గొన్నారు.

మోటారు బైక్‌ను ఢీకొన్న ఆటో : ఇద్దరికి తీవ్రగాయాలు

కావలిరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి ఆర్సీపాలెం సమీపంలో మలుపు వద్ద శనివారం ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. మండలంలోని కొత్తపల్లి పెట్రోల్ బంకు వద్ద అనిల్ వెల్డింగ్ షాపులో పనిచేస్తూ కొత్తపల్లిలో ఉంటున్న షేక్ బాషా, జమ్మలపాలెంకు చెందిన షరీఫ్‌లు వెల్డింగ్ పనుల నిమిత్తం కొండాపురం మండలంలోని కొమ్మికి మోటారు బైక్‌పై కొత్తపల్లి నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలోని పడమటి ఆర్సీపాలెం మలుపు వద్దకు వెళ్లేసరికి ప్యాసింజర్ ఆటోకు రెండు వైపులా షామియానా పైపులు కట్టుకుని వేగంగా వస్తూ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తరలించేందుకు 108కు ఫోన్ చేసినప్పటికీ రాకపోవటంతో విషయం తెలుసుకున్న వెల్డింగ్ షాపు యజమాని చిమ్మిలి అనిల్ తన కారులో ఏరియా సుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.



రోడ్డుపై గాయాలతో పడి ఉన్న క్షతగాత్రులు, దెబ్బతిన్న బైక్

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

● ఇద్దరు విక్రేతల అరెస్ట్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి కొనుగోలు చేసి నెల్లూరులో అధిక ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్న ఇద్దరు నిందితులను సంతపేట పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య శనివారం విలేకర్లకు వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్ఐ జీ బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి నగరంలో తనిఖీలు చేపట్టారు. నెల్లూరు రూరల్ మండలం చంద్రబాబునగర్‌కు చెందిన షేక్ మాబాషా, చాణిక్యపురి నగర్‌కు చెందిన బీ శ్రీను అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని బ్యాగులను తనిఖీ చేయగా రూ.1.20 లక్షల విలువ చేసే ఆరు కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. వ్యసనాలకు బానిసైన నిందితులు ఈజీ మనీ కోసం గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారని తెలుసుకున్నారు. ఒడిశా నుంచి కేజీ గంజాయిని రూ.5వేలకు కొనుగోలు చేసి నెల్లూరులో రూ.20 వేలకు విక్రయించేందుకు తీసుకువచ్చామని విచారణలో తెలిపారు. నిందితులను అరెస్టు చేసి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన సీఐ, ఎస్ఐ, సిబ్బంది జీ శ్రీహరి, సుబ్బారావు, ప్రసాద్, అల్లాభక్షు, సురేంద్రబాబు, గోపి, కేవీ సుదర్శన్‌గౌడ్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ సోమయ్య, పక్కన ఎస్ఐ బాలకృష్ణ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100)	560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,860
వెండి కిలో ధర రూ. 1,54,000
వెండి ఒక గ్రాము రూ.160.00

3వ విడత డిగ్రీ ప్రవేశాలకు నేడు రిజిస్ట్రేషన్

కందుకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో మూడవ విడత డిగ్రీ ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 26 తేదీ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీన మార్పులకు అవకాశం ఉంటుందని, నవంబరు 1న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు 4న కళాశాలలో చేరాల్సి ఉంటుందని తెలిపారు.

యూరియా పంపిణీ

జలదంకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్నవరం రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీవాణి, సిబి రిజర్వాయరు అధ్యక్షుడు పూనూరు భాస్కర్ రెడ్డి, టీడీపీ యువనేత పూనూరు రామకృష్ణా రెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌పై విద్యార్థులకు అవగాహన

కొండాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌పై సెంట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ మాల్యాద్రి శనివారం అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల దినంలో భాగంగా పోలీసుల విధులు, ఫిర్యాదుల నమోదు, వైర్‌లెస్ సెట్లు, స్టేషన్‌లో నిర్వహించే రికార్డులు, లాకప్, తుపాకీ వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీలకు కందుకూరు క్రీడాకారులు

కందుకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీలలో కడప జిల్లా రైల్వేకోడూరులో జరగనున్న రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీలకు కందుకూరుకు చెందిన బాలుర విభాగంలో ఎస్కే షంషుజామ, బాలికల విభాగంలో బి.లక్ష్మీఅక్షర, ఎస్కే సమీహాలు ఎంపికయ్యారని త్రైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని, కోచ్ అఖిల్‌ను ఆయన అభినందించారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాల పరిశీలన

వలేటివారిపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు, వలేటివారిపాలెం హైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఎంపీడీవో శంకర్‌రావు శనివారం పరిశీలించారు. ఈ కేంద్రాలు ఈనెల 31వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సీతారామపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కేంద్రాలను మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మస్తాన్‌వలి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రారంభించిన ఆధార్ కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, ప్రవీణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంగయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కావలి : నాగుల పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

కావలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నాగుల చవితి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సబ్‌కోర్టు సెంటర్, జనతాపేట, ఉత్తరంపేట రామాలయం, రామమూర్తి పేట, ముసునూరు, కావలి చెరువు తదితర ప్రాంతాలలో ఉన్న పుట్టల వద్ద భక్తులు తెల్లవారుజాము నుంచి పూజలు చేసేందుకు బారులు తీరారు. భక్తులు చలివిడి, సజ్జల నానపాలు, బెల్లంను ప్రసాదంగా పంచి పెట్టారు.

● **కావలి రూరల్ :** మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు పుట్ట మందిరాలకు చేరుకుని పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్రస్వామి కి ప్రీతి ప్రాయమైన కోడి గుడ్లు, పాలు, చలివిడి పిండి నైవేద్యాలుగా సమర్పించారు.

● **వలేటివారిపాలెం :** మండలంలో మహిళలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు చేసి పాముల పుట్టల వద్దకు వెళ్లి నోముల దారాలు, నువ్వులు చలిపిండి పెట్టి పుట్టలకు దారాలు చుట్టి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఉపవాసాలు ఉండి కంకణాలు ధరించి పూజలు చేశారు.

● **లింగసముద్రం :** మండలంలోని ఆర్ఆర్ పాలెం పంచాయతీ గొల్లపాలెంలో పుట్ట వద్దకు లింగసముద్రం, జంపాలవారిపాలెం, వాకమళ్లవారిపాలెం, పెంట్రాల, కందుకూరు, గుడ్లూరు, కావలి తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో వచ్చి నాగదేవత పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. పుట్ట వద్దకు వచ్చిన మహిళలకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

● **అల్లూరు :** మండలంలో మహిళలు నాగేంద్రుడి పుట్టల వద్దకు చేరుకొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పుట్టల చుట్టూ దారాలు చుట్టి కోరిన కోర్కెలను తీర్చే దైవంగా నాగేంద్రుడికి మొక్కులు తీర్చుకున్నారు.

● **బిట్రగుంట :** బోగోలు బజారు కూడలోని నాగుల పుట్ట, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు నాగవరపమ్మ ఆలయ సమీపంలో, ఇబ్రహీంపేట మఠం వద్ద పూజలు నిర్వహించారు. బిట్రగుంట షిరిడీ శేషసాయి మందిర ఆవరణలోని జంటనాగుల శిలల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ఓమోస్తరు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మల్లికార్జున కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్లవాగులో గల్లంతై మృతి చెందిన దంపూరు మల్లికార్జున కుటుంబాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం మృతుడి భార్య గోవిందమ్మకు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం తరుపు న మరింతసాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, నాయకులు మునగాల వెంకటేశ్వరరెడ్డి, తిరుపతి ఉన్నారు.

రూ.9.78 కోట్లతో మాలకొండ అభివృద్ధి

వలేటివారిపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయం అభివృద్ధికి రూ.9,78,11,426 మంజూరైనట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

● మండలంలోని మాలకొండలో మహా అన్నదాన సత్రం సమీపంలో నిర్మించనున్న పోలీస్‌అవుట్ పోస్టుకు ఆలయ డీసీ చంద్రశేఖర్, ఎస్ఐ మరిదినాయుడుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, న్యాయవాది ప్రగడ శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల నుంచి రూ.5,66,180 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

కలిగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్, భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు, చిన్న అన్నలూరు. వెంకన్నపాలెం యూపీ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు అధికారులు, సర్పంచులు తరలించాలని కోరారు. ముందుగా లోతట్టు ప్రాంతాలను సందర్శించి భారీ వర్షాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది దీక్షితులు, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.

● **బిట్రగుంట :** భారీవర్షాలు, తుపానులకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నామని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి అన్నారు. బోగోలు మండలం తాటిచెట్లపాలెం తీరప్రాంతంలో రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలను గుర్తించారు. ఆయన వెంట ఆర్ఐ రామకుమారి ఉన్నారు.

● **అల్లూరు :** తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతాల్లోని తుఫాన్ షెల్టర్లను ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని పలు సురక్షిత ప్రాంతాలు, తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

కావలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఖైదీలు నేరప్రవృత్తికి దూరంగా సత్ప్రవర్తన కలిగి ఉండాలని కావలి అడిషనల్ ఫస్టక్లాస్ జ్యుడిషయల్ మేజిస్ట్రేట్ విక్రమసింహ తెలిపారు. కావలి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌జైలులో శనివారం ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ఖైదీల కేసుల పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందించనున్నట్లు తెలిపారు. వారికి అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల మోటారు సైకిల్ ర్యాలీ

కావలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పట్టణంలో మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీని ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మల్లె అంకయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు సాగింది. యూనియన్ కార్యదర్శి టీ.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు వై.రవి, పీ.శ్రీను, సీపీఐ నాయకులు దమ్ము దర్గాబాబు, ఎం.వెంకటేశ్వర్లు, చేవూరు కొండయ్య, గుంజి శ్రీను, రాజేష్, వినోద్ పాల్గొన్నారు.

పోలీసులకు రెయిన్ కోట్ల బహూకరణ

కావలి(టౌన్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ దాతృత్వంతో 200 మంది పోలీసులకు శనివారం రెయిన్ కోట్లు బహూకరించారు. వీటిని డీఎస్పీ కార్యాలయం ఆవరణలో డీఎస్పీ శ్రీధర్ పోలీసు అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఫిరోజ్, గిరిబాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, పీ.శ్రీకాంత్, సునీల్, రామకృష్ణ, చక్రీ, మధు పాల్గొన్నారు.

యాప్‌లపై మెప్మా సిబ్బందికి అవగాహన

కావలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా సిబ్బందికి వాట్సప్ సర్వీసెస్, ప్రజ్ఞాయాప్, పురమిత్ర యాప్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైవింగ్‌హుడ్ ప్రమోషనల్ సెల్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఐబీ అకయ్య, డీఆర్పీ జయశ్రీ, డీజీ లక్ష్మి, మున్సిపల్ మేనేజరు ఫణికుమార్ పాల్గొన్నారు.

నేడు కావలి ఎడవల్లిలో మంత్రి ఆనం పర్యటన



మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, టీడీపీ నాయకులు

ఏఎస్ పేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కావలిఎడవల్లి గ్రామంలో ఆదివారం దేవదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్బూరి రమేష్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన సంగం సిఐ వేమారెడ్డితో కలసి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాల్యాద్రి నాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామి పథకం ద్వారా పనులు కల్పించాలని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు కోరారు. శనివారం పామూరుపల్లి పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల ఎంపికకు గ్రామసభ నిర్వహించడం అభినందనీయమన్నారు. పంచాయతీ పరిధిలో అవసరమైన శాశ్వత పనులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు తెల్లగొర్ల సుశీల, ఏపీవో ఆజంఖాన్, టీడీపీ నాయకులు తెల్లగొర్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆటో కార్మికుల ర్యాలీ

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏటీఎస్ సెంటర్లకు వ్యతిరేకంగా సీఐటీయు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఆత్మకూరు పట్టణంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య తెలిపారు. శనివారం ఆయన ఆటో కారికుల యూనియన్ నాయకులతో కలిసి ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయు మండల కార్యదర్శి మహేష్, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినం సందర్భంగా శనివారం ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, నాగేంద్రపురం, కాశీనాయన ఆశ్రమం, కొలగాని రామయ్యసత్రం, జ్యోతినగర్, ఎల్ఆర్‌పల్లి, చెరువు, తదితర ప్రాంతాల్లో ఉన్న నాగుల పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత అలఘనాథస్వామి దేవస్థానం, కాశీనాయన ఆశ్రమంలోని నాగశిలల వద్ద పూజలు చేశారు.

●**సంగం:** స్థానిక శివాలయంలోని నాగశిలలకు, కోలగట్ల పెన్నానది ఒడ్డున నాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగుల పుట్టకు మహిళలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

●**ఏఎస్‌పేట:** ఏఎస్ పేటతో పాటు అనుమసముద్రం, పెద్దహబ్బీపురం, జమ్మవరం, చిరమన, హసనపురం తదితర గ్రామాలలో శనివారం నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయం పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

●**ఉదయగిరి:** నాగుల చవితి పర్వదినం సందర్భంగా పట్టణంలోని సంతానలక్ష్మీ, నగిరితోటలో ఉన్న నాగులపుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేపట్టి పుట్టలో పాలు పోశారు. మండలంలోని గండిపాళెం, వెంకట్రావుపల్లి, అప్పసముద్రం, కుర్రపల్లి బీసీ కాలనీ, శకునాలపల్లి, బోడబండ, కృష్ణంపల్లి, గండిపాళెం, వెంకట్రావుపల్లి, గుడినరవ, మసీదుపల్లి, బిజ్జంపల్లి తదితర గ్రామాల్లో సైతం పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు.

●**దుత్తలూరు:** నాగులచవితి పర్వదిన వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నాగారప్పమ్మ శిలలు, పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు.

●**వరికుంటపాడు(ఉదయగిరి రూరల్):** స్థానిక వైకుంఠపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నాగులచవితి, కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ చేపట్టారు. అలాగే పలు గ్రామాల్లోని ఆలయాలు, పుట్టల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

●**సీతారామపురం:** మండల కేంద్రంలోని గ్రామ దేవత అంకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగేంద్రస్వామి క్షేత్రంలో నాగుల చవితి వేడుకలు శనివారం నిర్వహించారు. భక్తులు నాగదేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సంగం: నాగశిలలకు పూజలు చేస్తున్న మహిళలు

ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి



ఆర్టీసీ కార్మికులకు దుస్తులు అందజేస్తున్న నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికులు అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన ఆత్మకూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపోలో పనిచేస్తున్న 26 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రెయిన్‌కోట్, ఆప్రాన్ కలిగిన కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్, బిజెపి సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, బిజెపి నాయకులు నలిశెట్టి జగదీశ్, నలిశెట్టి శ్రీనివాసులు, డిపో మేనేజర్ ఎం శివకేశ్‌యాదవ్, అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ (మెకానికల్) ఎం బాబురావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కాగృహాల మంజూరు

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో పీఎంఏవై గ్రామీణ పథకం కింద అర్హులకు పక్కాగృహాలు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ శరత్ తెలిపారు. శనివారం మండలంలోని అశ్వనిపురం ఎస్టీ కాలనీలో ఆయన స్థానిక టిడిపి నేతలతో కలిసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయుటకు మండలంలో 21 మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఎంపీడీవో, హౌసింగ్ ఏఈని నియమించారన్నారు. పీఎంఏవై గ్రామీణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల పరిధిలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో నాయకులు లబ్ధిదారులకు పథకం గురించి వివరించి అర్హులు పేర్లు నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు.

దెబ్బతిన్న వరిపైరు పరిశీలన




దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అనంతసాగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతాళపల్లి, ఉప్పలపాడు, గోవిందమ్మపల్లి, పాతదేవరాయపల్లి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల బృందం శనివారం పరిశీలించింది. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో శైలజాకుమారి పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకుంటేనే ఉపాధి పనులు : ఏపీడీ

సీతారామపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు ఉన్న కూలీలందరూ ఈకేవైసీ చేయించుకుంటేనే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఉదయగిరి ఏపీడి మృధుల అన్నారు. ఆమె శనివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లా డుతూ నిర్ణీత గడువులోగా ఈకేవైసీ చేయించుకోని వారికి ఉపాధి హామీ పని కల్పించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్యామల, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు కొత్త జగదీష్, సుమన్‌బాబు, సుబ్బారెడ్డి, నారాయణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



పాపవినాశనం డ్యాం గేట్లు ఎత్తివేత

తిరుమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షాలకు తిరుమలలోని పాపవినాశనం డ్యాం కూడా నిండిపోవడంతో శనివారం మధ్యాహ్నం గేట్లు ఎత్తివేశారు. గురువారానికే తిరుమలలోని ఐదు డ్యాములు 85 శాతానికి నిండిపోయాయి. గోగర్భం డ్యాం శుక్రవారం పూర్తిస్థాయిలో నిండిపోవడంతో ఓ గేటును ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం ఉదయానికి పాపవినాశనం డ్యాం కూడా నిండిన క్రమంలో మధ్యాహ్నం 12 గంటలకు గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. మరో మూడు డ్యాములు కూడా దాదాపుగా నిండిపోయాయి.

ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు

శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని 27వ తేదీన ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ శ్రీకాళహస్తి డిపో మేనేజరు రేవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శ్రీకాళహస్తి బస్టాండు నుంచి బస్సు బయలుదేరి గుడిమల్లం, అప్పలాయగుంట, వకులమాత ఆలయం, ముక్కోటి, తలకోనకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు శ్రీకాళహస్తికి చేరుతుందని తెలిపారు. టిక్కెట్టు ధర రూ.450గా నిర్ణయించామని వెల్లడించారు.

పెద్దశేష వాహనంపై మలయప్ప దర్శనం

నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పెద్దశేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్లు తిరుమాడవీధుల్లో ఊరేగారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, గోవిందనామ స్మరణలు, కర్పూర హారతుల నడుమ పెద్దశేష వాహనం వైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





'గ్రేటర్'తో బహిర్గతమైన కూటమి నేతల సమన్వయ లోపం

- ప్రభుత్వ కీలక నిర్ణయాన్ని సైతం ప్రచారం చేసుకోలేని దైన్యం

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు అంశంతో తిరుపతి నియోజకవర్గ కూటమి నేతల నడుమ సమన్వయం ఏపాటిదో బహిర్గతమైంది. తిరుపతి నగర చరిత్రను, అభివృద్ధిని మేలి మలుపు తిప్పే ప్రభుత్వ కీలక నిర్ణయాన్ని సైతం ప్రచారం చేసుకోలేని దైన్యం కూటమి పార్టీల నేతలను ఆవహించింది. తిరుపతితో పాటు పొరుగున ఉన్న చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలతో ముడిపడిన గ్రేటర్ ప్రతిపాదనపై జిల్లా యంత్రాంగం అధికారిక కసరత్తు మినహా కూటమి పార్టీల నేతల నడుమ రాజకీయంగా కసరత్తు నడిచిన దాఖలాలు లేవు. తీరా అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే తరుణంలో కూడా దానికనుగుణంగా సన్నద్ధం కాలేకపోవడం కూటమి పార్టీల శ్రేణులను తీవ్ర నిరుత్సాహానికి, నైరాశ్యానికి గురి చేస్తోంది. రావాల్సిన స్థాయిలో మైలేజీ రాలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్రేటర్ తిరుపతి... కీలక నిర్ణయం

గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదన ఆషామాషీ కాదు. నగర చరిత్రను, అభివృద్ధిని మేలి మలుపు తిప్పే కీలక అంశం. సీఎం చంద్రబాబు సొంత జిల్లా తిరుపతి అభివృద్ధి పట్ల మరింత నిబద్ధతతో ఉంటారన్నది ఎవరికీ తెలియంది కాదు. గరుడ వారధి మొదలుకుని ఐఐటీ, ఐసర్, ఐఐడీటీ, స్విక్కార్ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థల ఏర్పాటుకు కారకులు ఆయనే అన్నది కూడా అందరికీ తెలిసిందే. అలాంటిది తిరుపతి నగర కార్పొరేషన్ పరిధిని 30 చదరపు కిలోమీటర్ల నుంచి ఒకేసారి 284 చదరపు కిలోమీటర్లకు విస్తరించే ప్రయత్నం చిన్న విషయం కాదు. తిరుపతిని భవిష్యత్తులో మహానగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని ఈ దశకు తీసుకురావడానికి జిల్లా యంత్రాంగానికి ఎనిమిది నెలలకు పైగా పట్టింది. ఈ ప్రతిపాదన అమలైతే నగర జనాభా 4.50 లక్షల నుంచి 7.50 లక్షలకు, గ్రాంట్లు కాకుండా వార్షికాదాయం రూ.149 కోట్ల నుంచి రూ. 182 కోట్లకు పెరుగుతుంది. కార్పొరేషన్ పరిధి తిరుపతి నియోజకవర్గం దాటి చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోకి విస్తరిస్తుంది.

గ్రేటర్ ప్రతిపాదనకు ముందు జరగని రాజకీయ కసరత్తు

గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదనను మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అజెండాలో చర్చకు పెట్టే ముందు కేవలం అధికారిక కసరత్తు మాత్రమే జరిగింది. రాజకీయంగా కసరత్తు గానీ, సన్నద్ధత కానీ జరగలేదు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో కలెక్టర్ అధికారిక కసరత్తు చేస్తున్న సంగతి కూటమి పార్టీల ముఖ్య నేతలందరికీ తెలుసు. ఈనెల 24న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు పెడతారని కూడా తెలుసు. అయితే అంతకంటే ముందుగానే సీఎం ఆదేశాలు, అధికారికంగా జరుగుతున్న ప్రయత్నాలు, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో కూటమి నేతలు ఘోరంగా విఫలమయ్యారు. తిరుపతిలోని కూటమి పార్టీల ముఖ్య నేతలు చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలను కలుపుకుని ప్రెస్‌మీట్ పెట్టి సీఎం నిర్ణయాన్ని వెల్లడించే ప్రయత్నం కూడా చేయలేదు. తీరా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం పెట్టగా దాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు వైసీపీ కార్పొరేటర్లు గట్టిగా ప్రయత్నించారు. ముందే సన్నద్ధమై ప్లకార్డులు సైతం సమావేశంలోకి తెచ్చుకోవడం గమనార్హం. థ్యాంక్యూ సీఎం అనే ప్లకార్డులు ప్రదర్శించాలన్న ప్రయత్నం కూడా కూటమి నేతల నుంచి జరగకపోవడం శ్రేణుల్ని బాధిస్తోంది.

కలిగే ప్రయోజనాలు ఇవీ..

నగర స్థాయి పెరిగే కొద్దీ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద విరివిగా నిధులు మంజూరవుతాయి. కొత్తగా కార్పొరేషన్ పరిధిలో చేరే ప్రాంతాల్లో భూములు, స్థలాల విలువ పెరుగుతుంది. వ్యవసాయ భూములు సైతం నివాస, వాణిజ్య విలువను సంతరించుకుంటాయి. రియల్ ఎస్టేట్ రంగం జోరందుకుంటుంది. నగర విస్తృతితో కొత్త లే అవుట్లు, ప్లాన్ అప్రూవల్ వంటి వాటితో నగర పాలక సంస్థ ఆదాయం పెరుగుతంది. ఆ నిధులన్నీ తిరిగి అభివృద్ధి కార్యక్రమాలకు అందుబాటులోకి వస్తాయి. అలాగే విలీన గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి. అంతిమంగా ఇతర ప్రాంతాల నుంచి వలసలు పెరుగుతాయి. వ్యాపార కార్యకలాపాలు పెరిగి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



మూడు బోట్లు... 24 గంటలు

- అవిశ్రాంతంగా శ్రమించిన పోలీసులు, రెస్క్యూ టీంలు
- గల్లంతైన బాలుర మృతదేహాలు లభ్యం



తిరుపతి(నేరవిభాగం), రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం వద్దనున్న స్వర్ణముఖి నదిలో శుక్రవారం గల్లంతైన నలుగురు విద్యార్థుల ఆచూకీ కోసం అధికారులు, పోలీసులు 24 గంటలు... మూడు బోట్లతో ముమ్మరంగా జరిపిన గాలింపు చర్యలు ఫలించాయి. వేదాంతపురం పంచాయతీ, రామదాసుకాలనీకి చెందిన మునస్వామి రెడ్డి కుమారుడు బాలు(16) మృతదేహం శుక్రవారం లభ్యం కాగా శనివారం మధ్యాహ్నానికి తేజు, ప్రకాష్ మృతదేహాలు లభించాయి. సాయంత్రానికి మునిచంద్ర(15) మృతదేహం దొరికింది. చంద్రగిరి ఎమ్మెల్యే నాని, ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీవో రామ్మోహన్‌రావు, జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్, సీఐలు, ఎస్ఐలు, ఫైర్ సిబ్బంది దగ్గరుండి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. శనివారం తెల్లవారుఝామున 5 గంటల నుంచి మూడు బోట్లు ద్వారా దాదాపు 12 గంటల పాటు నది మొత్తం గాలించారు.

శోకసంద్రంలో వేదాంతపురం

- నది వద్ద మిన్నంటిన తల్లిదండ్రుల ఆర్తనాదాలు

తిరుపతిరూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామానికి ఆనుకుని ఉన్న స్వర్ణముఖి నది వంకలో శుక్రవారం సాయంత్రం గల్లంతైన నలుగురు బాలురూ అసువులుబాయడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బిడ్డల ఆచూకీ కోసం శుక్రవారం సాయంత్రం నుంచి ఎదురుచూసిన తల్లిదండ్రులకు చివరకు కడుపుకోత మిగిలింది. చేతికందే వయస్సు బిడ్డలు మృతదేహాలుగా బయటకు రావడంతో ఆర్తనాదాలు మిన్నంటాయి. 'కడుపుకోత మిగిల్చి వెళ్లారా నాయనా' అంటూ కిందపడి దొర్లుతూ రోదించారు. వీరి రోదన చూసిన గ్రామస్తులు కంటతడిపెట్టారు.

● ఎంతవెతికినా కనిపించవేమినాయనా..

చిన్న కుమారుడు బాలు మృతదేహం శుక్రవారమే లభించడంతో పుట్టెడు దుఃఖంతో ఉన్న మంజుల, మునస్వామిరెడ్డి దంపతులు శనివారం ఉదయం నదివద్దకు చేరుకుని బోరున విలపించారు. ఉదయం 10 గంటలు దాటుతున్న పెద్ద కుమారుడు తేజ ఆచూకీ దొరక్కపోవడంతో 'ఎంతవెతికినా కనించవేమినాయనా.. ఎంతమంది వెతుకుతున్నా కనిపించకుండా ఎక్కడున్నావు నాయనా' అంటూ తల్లి మంజుల బోర్లాపడి గుండెలవిసేలా రోదించారు. 'తమ్ముడు పుట్టిన రోజున ఇద్దరూ మాకు దూరమయ్యారా' అంటూ రోధించడం అందరినీ కంటతడి పెట్టించింది. 'మేము బతికేదెలా దేవుడా' అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. వీరిని ఓదార్చడం అక్కడున్న వారెవరివల్ల కాలేదు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని మునస్వామిరెడ్డిని ఓదార్చారు.

- మంజుల, బాలు, తేజల తల్లి

● సొమ్మసిల్లిన మునిచంద్ర తల్లి ఎల్లమ్మ



సొమ్మసిల్లిన ఎల్లమ్మ

నదిలో గల్లంతైన కుమారుడు మునిచంద్ర కోసం ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి నదివద్దకు చేరుకుని కుమారుడి ఆచూకీ కోసం ఎదురుచూసి..చూసీ సొమ్మసిల్లింది. ఏడ్చి..ఏడ్చి కన్నీరు ఇంకిపోయింది. మునిచంద్ర నాయనమ్మ మనవడిని తలచుకుని ఎక్కిఎక్కి ఏడ్చింది. 'మాకెందుకు అన్యాయం చేశావు దేవుడా' అంటూ బోరున విలపించింది. సాయంత్రానికి మునిచంద్ర మృతదేహం నదిలో లభించింది. తండ్రి మునిశేఖర్ మౌనంగా కంటతడిపెట్టడం అందరినీ కలచివేసింది. వీరి చిన్న కుమారుడు కూడా ఈతకు వెళ్లిన ఏడుగురిలో ఒకరని, అదృష్టవశాత్తు క్షేమంగా బయటపడ్డాడని గ్రామస్తులు అంటున్నారు.

కళ్లెదుటే స్నేహితులు మునిగిపోయారు : విష్ణువర్ధన్



నాతోపాటు ఏడుగురు స్నేహితులు ఈత కోసం వచ్చాం. ఇసుక దిబ్బపై ఆడుకుంటూ ఉండగా ప్రవాహ ఉధృతి పెరిగింది. స్నానం చేస్తున్న నలుగురు కొట్టుకుపోయారు. నాతో పాటు మరో యువకుడు నదిలోని దర్బను పట్టుకోవడంతో బయటపడ్డాం. కళ్లెదుటే స్నేహితులు మునిగిపోవడం బాధ కలిగించింది.

ఇసుకదిబ్బే మృత్యు కుహరంగా..

నదిలో నిల్వ చేసిన ఇసుక దిబ్బపైనే గల్లంతైన బాలురు సరదాగా కేరింతలు కొడుతూ ఈతకు దిగారని తెలుస్తోంది. వీరు విప్పిన దుస్తులు, చెప్పులు కూడా దిబ్బపైనే కనిపించాయి. నీటి ప్రవాహం పెరగడంతో ఉధృతికి బాలురు గల్లంతయ్యారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా ఇసుక మాఫియా అనధికారికంగా ఇసుకను తోడేస్తున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. దీంతో తొండవాడ నుంచి తనపల్లె వరకూ నదిపొడవునా పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఇసుక అక్రమ రవాణా ఆగడంలేదు. నదిలోకి వివిధ మార్గాల్లో ప్రవేశించి ఇసుకను తోడేసి విక్రయాలు చేపడుతున్నారు. ఇసుకను తోడేయడం వల్లే ఈ ప్రాంతంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని గ్రామస్తులు అంటున్నారు.

ఘటన బాధాకరం : ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం స్వర్ణముఖి నదిలో జరిగిన ఘటన బాధాకరమని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. నదులు, వాగులు, వంకల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన ఊరు, మనకు తెలిసిన, తిరిగిన ప్రాంతం కదా అని అలసత్వం పనికి రాదన్నారు. ఇప్పటికే వాగులు, వంకల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. మృతుల కుటుంబాలకు పోలీసు శాఖ తరఫున సానుభూతి తెలిపారు.

తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండండి

- సెలవుల రద్దు ● డిస్కం సీఎండీ శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల సదరన్ డిస్కం పరిధిలో ఉన్న తొమ్మిది జిల్లాల్లో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ సీఎండీ శివశంకర్ హెచ్చరికలు జారీ చేశారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయం నుంచి శనివారం తొమ్మిది జిల్లాల ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ తీరం దాటేవరకు క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు సెలవులు రద్దు చేశామన్నారు. ప్రతి ఒక్కరు కంపెనీ పరిధిలోని సెక్షన్లలో జేఎల్ఎం, ఏఎల్ఎం, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇంజనీర్లు, ఏఈలు, డీఈఈలు, ఈఈలు, ఎస్ఈలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రధానంగా ఆది, సోమ, మంగళవారాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం తీవ్రత ఆధారంగా ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌లకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఉమ్మడి ఐదు జిల్లాలకు ఐదుగురు సీజీఎంలను పర్యవేక్షించడానికి నియమించామన్నారు.

సహాయక చర్యలకు రూ.2 కోట్లు

- భారీ వర్షాల నేపథ్యంలో విడుదల చేసిన ప్రభుత్వం

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.2 కోట్లు విడుదల చేసింది. భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలకు నిధులు కేటాయించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఇతర జిల్లాల నుంచీ అభ్యర్థనలు రావడంతో స్పందించిన ప్రభుత్వం 11 ప్రభావిత జిల్లాలకు నిధులు విడుదల చేసింది. ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉన్న తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు రూ.2 కోట్లు చొప్పున, మిగిలిన 8 జిల్లాలకు రూ.కోటి చొప్పున విడుదల చేసింది.

ముంచుకొస్తున్న మొంథా

- తుఫానుగా మారనున్న వాయుగుండం ● జిల్లాకు భారీ వర్ష సూచన ● రేపు పీజీఆర్ఎస్ రద్దు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (0877-2236007) ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఆదివారం సాయంత్రం నుంచి తుఫాన్‌గా బలపడే అవకాశముంది. దీనికి మొంథాగా నామకరణం చేశారు. ఈ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపనుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. జిల్లా అధికారులతో శనివారం ఆయన వర్చువల్ విధానంలో సమీక్షించారు. సోమవారం నుంచి జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మండల కేంద్రాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నీటి కుంటలు, కాలువలు, చెరువులు, నదీ పరివాహక, సముద్ర తీర ప్రాంతాలకు ఈత కొట్టేందుకు, చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవసరమొచ్చినా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు 0877-2236007ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు పీజీఆర్ఎస్ రద్దు

భారీ వర్ష సూచన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటించారు.అధికారులు సహాయక చర్యల్లో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

తుఫాన్ నష్టం రూ.238కోట్లు

గడచిన నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు రూ.238కోట్లు ఆస్తినష్టం వాటిల్లింది. 131 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులకు గాను రూ.10కోట్లు అవసరం కానుంది. ఇరిగేషన్‌కు సంబంధించి రూ.19 కోట్లు, పశుసంవర్థక శాఖకు రూ.6కోట్లు, ఏపీఎస్‌పీడీసీఎల్‌కు రూ.53కోట్లు, పంచాయతీరాజ్‌కు రూ.24కోట్లు, ఉద్యానవన పురపాలక శాఖలకు సంబంధించి కూడా ఆస్తినష్టం వాటిలిందని జిల్లా అధికారులు వివరించారు. ఏడుగురు మృత్యువాతపడ్డారని వెల్లడించారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై 25 కేసులు

తిరుపతి(రవాణా), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ, పోలీసు అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై తనిఖీలు చేపట్టారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు సమీపంలో శనివారం రాత్రి మెరుపు దాడులు చేశారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్, గాజు బ్రేకర్లు, అగ్నిమాపక పరికరాలు, ఫైర్ అలారం, ప్రథమ చికిత్స కిట్లు పరిశీలించారు. వాహన ధ్రువపత్రాలు, వాహన కండీషన్, డ్రైవర్ల లైసెన్సుల వివరాలు తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 25 కేసులు నమోదు చేసినట్లు ఏఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా రవాణాశాఖాధి కారి మురళీమోహన్ తెలిపారు.

3న బార్సిలోనాకు మౌర్య

- స్మార్ట్‌సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్‌లో పాల్గొననున్న కమిషనర్

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య వచ్చే నెల 3వ తేదీన స్పెయిన్‌కు వెళ్లనున్నారు. ఆ దేశంలోని బార్సిలోనా నగరంలో 4 నుంచి 6వ తేదీ వరకు జరిగే స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్-2025 సదస్సులో పాల్గొననున్నారు. ఏపీ నుంచి విశాఖ, తిరుపతి మున్సిపల్ కమిషనర్లకు ఈ అవకాశం దక్కింది. ఈ రెండు నగరాలూ కేంద్ర ప్రభుత్వ తొలి స్మార్ట్ సిటీస్ జాబితాలో ఉన్న సంగతి తెలిసిందే. వివిధ దేశాల స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను అధ్యయనం చేసి వాటిలో ఏపీలో అమలు చేయదగ్గ విధానాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. అలాగే తిరుపతిలో అమలు చేస్తున్న స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పద్ధతులను సదస్సు ముందుంచనున్నారు.

దీపావళి బహుమతి పేరుతో రూ.18లక్షలు కాజేశారు

తడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు టపాసులు, గిఫ్టులు ఇస్తామంటూ రూ.18లక్షలు కాజేసిన ఘటన తడ మండలంలో వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్ అన్నదమ్ములు. అరుణ్‌కుమార్ అపాచీలో పనిచేస్తుండగా కిరణ్‌కుమార్ సూళ్లూరుపేటలో జిరాక్స్ షాపు నడుపుతున్నాడు. దీపావళి పండుగకు గిఫ్టులు, టపాసులు ఇస్తామని నమ్మబలికి అపాచీ పరిశ్రమలోని ఉద్యోగుల నుంచి సుమారు రూ.18 లక్షల వరకు వసూలు చేశారు. పండుగ సమయానికి ఇద్దరూ కనిపించకపోవడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పది ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ అధికారులు

బాలాయపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిమిలి ఫారెస్ట్‌లో నిల్వచేసిన పది ఎర్రచందనం దుంగలను శనివారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసున్నారు. డీఆర్‌వో సుహాసిని మాట్లాడుతూ మండలంలోని అలమిలి ఫారెస్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనాల రాకపోకల జాడలు కనిపించడంతో గాలించామన్నారు. పొదల్లో దాచిన పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని వెంకటగిరి అటవీశాఖ కార్యాలయాన్ని తరలించడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో భవానీ, అశోక్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాసపురంలో శనివారం ప్రకృతి విపత్తులపై అటవీశాఖ, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. సముద్రతీరం వెంబడి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తీరం వెంబడి అపరిచితుల వ్యక్తుల సంచారాన్ని గుర్తించి మెరైన్, అటవీశాఖ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే సముద్రంలోకి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే స్టీమర్లు, బోట్‌లను ఎప్పటికప్పుడు పసిగట్టి మెరైన్ పోలీసులకు సహకారం అందించాలన్నారు. సమావేశంలో మెరైన్ ఎస్‌ఐ శివసౌమ్య, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసులు, ఏడుకొండలు, మత్స్యశాఖ అధికారులు రవి, రమేష్, సాయి, ధనంజయ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేయడం నేరం



కార్యక్రమంలో న్యాయమూర్తులు వెంకటనాగపవన్, సులోచనరాణి

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచనరాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ చట్టప్రకారం బాల్యవివాహాలు నేరమన్నారు. ఇందుకు సహకరించిన వారికి కూడా శిక్షపడుతుందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే ప్రజలు అధికారులకు సమాచారం అందించి అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో రజినీకాంత్‌రెడ్డి, రమేష్ నాయుడు, భాగ్యలక్ష్మి, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రాజేంద్ర సూచించారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిందని, ఈ మేరకు జిల్లాలో రెడ్ అలెర్ట్ ప్రకటించడం జరిగిందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. నిత్యావసర సరుకులు, ఆహారపదార్థాలు ముందస్తుగా నిల్వ చేసుకోవాలని సూచించారు. అలాగే మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు.

డక్కిలి: రాష్ట్రంలో మొంథా తుపాను నేపథ్యంలో మండలంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నెల 26నుంచి 29వ తేది వరకు తపాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వెంకటగిరి టౌన్: మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో పజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్‌వీ నరసింహరావు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రానున్న ఐదురోజుల్లో భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువుల, గొర్రెలు, మేకలు తదితర జీవాలను మేతకు తీసుకెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని సూచించారు.

పీఎంఏవై పథకానికి దరఖాస్తు చేసుకోండి

వాకాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ ఆవాజ్ యోజన (పీఎంఏవై) పథకానికి అర్హులైన వారు నవంబరు 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణ శాఖ డీఈ షబ్బీర్, ఎంపీడీవో సాయిప్రసాద్, హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహాల లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయండి

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావు అన్నారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పక్కాగృహాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై మండలాల వారీగా సమీక్షించారు. నవంబరు 5లోగా పక్కాగృహాల కోసం సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికి కోట మండలంలోని 159 మంది నుంచి దరఖాస్తులు అందాయన్నారు. అలాగే వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల నుంచి కూడా ఈ ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, హౌసింగ్ డీఈ షబ్బీర్, ఏఈ భాస్కర్‌రావు, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

30 నుంచి శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి నవంబరు ఒకటో తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం నిర్వహించనున్నారు. 30, 31 తేదీల్లో భజన మండళ్లతో నామసంకీర్తన, సామూహిక భజన, ధార్మిక సందేహాలు, ఉపదేశాలు, సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 31న ఉదయం 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం భజన మండలి సభ్యులు భజనలు చేస్తూ సప్తగిరీశుని చేరుకుంటారు. నవంబరు ఒకటిన సామూహిక నామసంకీర్తన, ధార్మిక సందేశం ఉంటాయి.

కారును ఢీకొన్న లారీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అన్నమేడు క్రాస్‌రోడ్డు జాతీయ రహదారి సమీపంలో శనివారం కారును లారీ ఢీకొంది. నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారును అన్నమేడు క్రాస్‌రోడ్డు సమీపంలో లారీ ఢీకొంది. ఈప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొన్న బస్సు

పెళ్లకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల పరిధిలో ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొన్న ఘటన శనివారం ఉదయం జరిగింది. శనివారం రాత్రి రాజమండ్రి నుంచి బెంగళూరుకు 34 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు పెళ్లకూరు మండల పరిధిలోని 71వ జాతీయ రహదారిపై కొత్తూరు సమీపంలో వెళ్తుండగా అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు, బస్సు సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని గేదె మృతి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకేంద్ర సెంటర్‌లో శనివారం లారీ ఢీకొని గేదె మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సుధాకర్ తెలిపారు.



నీళ్లలోనే ఉన్న పంట పొలాలు - ఎన్‌ఎం కండ్రిగ రోడ్డుపై పారుతున్న పొలంలోని నీళ్లు

చెరువుల్లా పొలాలు

- మాంబట్టులో 500 ఎకరాల మునక
- వర్షం ఆగిపోయినా నీళ్లల్లోనే వరి పంట

తడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన వర్షం అంతంత మాత్రమే... అయితే ఎగువ ప్రాంతాల్లో పడ్డ వర్షం రైతులకు శాపంగా మారింది. మండల పరిధిలోని గత వారం రోజులుగా మోస్తరు వర్షమే కురిసింది. దీంతో కొన్ని చెరువులు పాక్షికంగా నిండాయి. అయితే ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో కాళంగినదికి చెందిన గేట్లను ఎత్తివేయడంతో ఆ నీళ్లు మాంబట్టు, వెండ్లూరుపాడు చెరువులకు చేరాయి. తెలుగుగంగ నుంచి పాముల కాలువ ద్వారా వెండ్లూరుపాడు, మాంబట్టు చెరువులకు నీళ్లు చేరుతుంటాయి. వెండ్లూరుపాడు చెరువు పరిధిలో సుమారు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ఆ చెరువుకు ఉన్న నాలుగు కలుజులు పూడుకుపోవడంతో నిండాక నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండాపోతోంది. దీంతో మాంబట్టు పంచాయతీ పరిధిలోని ఎన్‌ఎం కండ్రిగ, చిన్నమాంబట్టు గ్రామాల్లోని సుమారు 500 ఎకరాల నీటి మునిగాయి. మూడు రోజులుగా వర్షం తగ్గిపోయినా పైనుంచి వచ్చే నీళ్లతో పొలాలు నేటికీ చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో అక్టోబరు నెల మొదటి నుంచే వ్యవసాయ పనులు మొదలవుతాయి. ప్రస్తుతం వరి పంట నాట్ల దశలో ఉంది. రైతులు ఇప్పటికే ఎకరాకు సుమారు 20వేల వరకు ఖర్చు చేశారు. నాలుగు రోజులుగా పొలాల్లో నీళ్లు నిలిచిపోవడంతో వరి పంట మొత్తం పాచిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఇరిగేషన్ అధికారులు వెండ్లూరుపాడు చెరువు కలుజులకు మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయని రైతులు వాపోతున్నారు.

కల్తీ మద్యాన్ని నిర్మూలించేందుకే సురక్ష యాప్

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యాన్ని నిర్మూలించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక దూదలకాలువ సమీపంలోని మద్యం దుకాణం వద్ద సురక్ష యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో విక్రయించే మద్యం నాణ్యమైనదా లేక కల్తీనా అని సురక్ష యాప్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కల్తీ మద్యం వల్ల రాష్ట్రంలో వేలాదిమంది మృతి చెందడంతో పాటు అనారోగ్యం పాలయ్యారన్నారు. వైసీపీ నాయకులు చేసిన అవినీతి, అక్రమాలను ఎదుటి వారిపై నెట్టడంలో ఆరితేరారని విమర్శించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు కరీమాబేగం, బాలకృష్ణ, ప్రసాద్, శేషమ్మ, మహేష్, సీఐ శేఖర్‌బాబు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు



సురక్ష యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే పాశిం, అధికారులు

రాజు, కిషోర్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, సోమిశెట్టి చెంచు రామయ్య, పెంచలయ్య, చంద్రమౌళి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు ఆర్టీసీ బస్సులో ఆత్మకూరువాసి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

నాయుడుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆర్టీసీ బస్సులో ఆత్మకూరువాసి శ్రీనివాసులు (42) మృతి చెందిన ఘటన నాయుడుపేట మండల పరిధిలోని పండ్లూరు సమీపంలో శనివారం జరిగింది. అర్బన్ సీఐ బాబి తెలిపిన వివరాల మేరకు... నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన శ్రీనివాసులు కొంతకాలంగా సత్యవేడులోని ఓ బార్బర్ దుకాణంలో పని చేస్తున్నాడు. శనివారం స్వగ్రామం వెళ్లేందుకు సూళ్లూరుపేటలో తమిళనాడు ఆర్టీసీ బస్సు ఎక్కి గూడూరు టిక్కెట్ తీసుకున్నాడు. పండ్లూరు సమీపంలోకి రాగానే శ్రీనివాసులు సీటులో ముందుకు పడిపోయి ఉండటంతో అనుమానం వచ్చిన డ్రైవర్ బస్సు ఆపేసి 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని శ్రీనివాసులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో డ్రైవర్ ధనంజయ బస్సును నేరుగా చిల్లకూరు పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోలీసులు గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్ ధనంజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాయుడుపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

అట్రాసిటీ కేసు విచారణ

బాలాయపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండిగల్లు గ్రామానికి చెందిన సర్వేపల్లి వజ్రమ్మను అదే గ్రామానికి చెందిన వెల్లంపాటి లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించారని బాధితురాలు మూడు రోజుల క్రితం బాలాయపల్లి పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసింది. శనివారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి నిండిగల్లు గ్రామానికి చేరుకుని విచారణ నిర్వహించారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ, పోలీసు అధికారులు

చిల్లకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద శనివారం రాత్రి రవాణాశాఖ, పోలీసు అధికారులు తనిఖీలు చేపట్టారు. కర్నూలు వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురై ప్రాణనష్టం జరగడంతో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. బూదనం టోల్‌ప్లాజా వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంవీఐ సునీల్‌రెడ్డి, ఏఎంవీఐలు ప్రభాకర్, శాంతి, చిల్లకూరు, గూడూరు రూరల్ ఎస్‌ఐలు సురేష్‌బాబు, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు ఈకేవైసీ నమోదు

చిట్టమూరు, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కార్మికులకు ఈకేవైసీ నమోదు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికులందరికీ ఈకేవైసీ తప్పనిసరి చేసింది. శనివారం టెక్నికల్ అసిస్టెంట్లు రమేష్, వీరాస్వామి, చిట్టమూరు ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు చిట్టమూరు, కొత్తగుంట గ్రామాల్లో ఉపాధి కార్మికులకు ముఖ ఆధారిత ఈకేవైసీ నమోదు చేశారు.

పీజీఆర్‌ఎస్ అర్జీలపై దృష్టి పెట్టండి

డక్కిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో భూ సర్వే పూర్తి చేయాలని మండల సర్వేయర్ పెంచలయ్య గ్రామ సర్వేయర్లకు సూచించారు. శనివారం మండలంలోని తీర్థంపాడు సచివాలయంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పీజీఆర్‌ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సర్వే రికార్డులు, మ్యాప్‌లు సక్రమంగా నిర్వహించాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే మండల రెవెన్యూ కార్యాలయానికి తెలిపాలని సూచించారు.

కర్నూలు బస్సు దుర్ఘటన భాధాకరం

గూడూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద సంఘటన బాధాకరమని శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో 19మంది వరకు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు.

28న వైసీపీ ర్యాలీ

సూళ్లూరుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ర్యాలీ చేపడతామని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, వైసీపీ నాయకులు వాకాటి బాబురెడ్డి, చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఐతా శ్రీధర్, రామకృష్ణారెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, ఎస్‌కే హుస్సేన్, తుపాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోట: మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 28వ తేదీన గూడూరులో జరిగే బహిరంగసభ, ర్యాలీని విజయ వంతం చేద్దామని వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి కోరారు. విద్యానగర్‌లో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, కస్తూరయ్య యాదవ్, వెంకటకృష్ణయాదవ్, సురేంద్ర, జయదీప్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహంలో తనిఖీలు

కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని శనివారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ తనిఖీ చేశారు. గదులు, మరుగుదొడ్లను పరిశీలించి వార్డెన్ పద్మజకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అధ్వానంగా జీఎన్టీ రోడ్డు



వినాయకుడి గుడి, ఆర్ఆర్ సూపర్ మార్కెట్ వద్ద రోడ్డులో గుంతలు

సూళ్లూరుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో ప్రధానమైన జీఎన్టీ రోడ్డు అధ్వానంగా మారింది. హోలీక్రాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు భారీ గోతులు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షమొస్తేచాలు రోడ్డుపై మోకాటి లోతునీరు నిలుస్తుండడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కాలువలు పూడిపోయి నీరు పారకపోవడంతో మడుగులను తలపిస్తున్నాయి. అడుగడుగునా గోతులు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జరిమానా

ఓజిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురు పట్టుబడినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. వారిని నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున న్యాయమూర్తి జరిమానా విధించారని తెలిపారు. మరో పర్యాయం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే జైలు శిక్ష విధించనున్నట్లు న్యాయమూర్తి హెచ్చరించారని ఎస్‌ఐ చెప్పారు.

ఘనంగా చండీయాగం



చండీయాగం చేస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో శనివారం మహాచండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగం జరిపారు.

అమ్మాయిని అమ్మోరులా పెంచాలి
సినీ దర్శకుడు మున్నా ధూళిపూడి

తిరుమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిని అమ్మోరులా ధైర్యంగా పెంచాలనే సందేశంతో 'బ్యాడ్ గర్ల్స్-కానీ చాలా మంచోళ్లు' అనే సినిమా తీస్తున్నట్లు ఆ చిత్ర దర్శకుడు మున్నా ధూళిపూడి తెలిపారు. నిర్మాత ఎమ్మాడి సోమనర్సయ్యతో కలిసి ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. అమ్మాయిలు తమను తాము కాపాడుకోవాలంటే సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించాలన్నారు. ఆడపిల్లలకు కరాటే నేర్పిస్తే రేప్‌ల సంఖ్య తగ్గుతుందని, అందుకే బ్యాడ్ గర్ల్స్ సినిమాకు వచ్చే కలెక్షన్లతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు.



గూడూరు కోర్టు ఆవరణ, తడలో నాగులపుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణ, విఘ్నేశ్వరపురంలోని నాగులపుట్ట, శివాలయం, కోదండ రామాంజనేయస్వామి ఆలయాల్లో నాగశిలలకు పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: మండల కేంద్రంలోని తెలుగుగంగ కార్యాలయం సమీపంలో ఉన్న పుట్ట, శంకరన్ గిజనకాలనీలోని పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కైవల్యానది ఒడ్డున ఉన్న నాగ మందిరం, ఆత్మమాలిక్, రామలింగేశ్వరి స్వామి ఆలయం, కాశీపేటలోని కాశీవిశ్వనాధ స్వామి ఆలయాల్లో నాగులచవితి పూజలు నిర్వహించారు.

బాలాయపల్లి: మండల పరిధిలోని బాలాయపల్లి, సుబ్రమణ్యం, జయంపు గ్రామాల్లో నాగుల చవితి పూజలు చేశారు.

తడ: మండలంలోని అన్ని గ్రామాల్లో నాగులచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాగుల పుట్టలను అలంకరించి పూజలు జరిపారు. పాలు, గుడ్లు, రాగులు, సజ్జలు నైవేద్యంగా సమర్పించారు.

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు, పెళ్లకూరు, జీలపాటూరు, శిరసనంబేడు గ్రామాల్లో నాగ దేవతల విగ్రహాలకు పాలతో అభిషేకాలు చేశారు. పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

కోట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నాగులపుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కేశవరం, మద్దాలి, చిట్టేడు, షైక్రోటవర్‌కాలనీ, విద్యానగర్, కోట, తిన్నెలపూడి, గూడలి తదితర గ్రామాల్లో నాగులపుట్టలకు దారాలు చుట్టారు. పుట్టల్లో పాలు, కోడిగుడ్లను వదిలారు.

సూళ్లూరుపేట: పట్టనంలోని చెంగాళమ్మ ఆలయం వద్దనున్న పుట్టకు భక్తులు పూజలు చేశారు. పాలుపోసి పూజలు చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సహాయ కమిషనర్ పుట్ట ప్రాంగణాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న నాగులపుట్ట, విన్నమాల రోడ్డు వద్ద ఉన్న నాగులపుట్ట, శివాలయాల్లో, స్వర్ణముఖినది వద్ద ఉన్న నాగులపుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు.

ఓజిలి: మండలంలో నాగులచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో పుట్టల వద్దకు మహిళలు పూజలు చేశారు. పుట్టకు దారాలు చుట్టి, కోడిగుడ్లు, పాలు పుట్టలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు.



సూళ్లూరుపేటలో చెంగాళమ్మ ఆలయం, నాయుడుపేటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు